ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
ఆదివారం, 16 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 03 | పేజీలు: 8 వెల: 5



# పెద్ద కలలు కనండి

**చిన్న కలలు ఇక సరిపోవు..**

- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనే సంకల్పం
- స్వయం సమృద్ధి దిశగా దేశం అడుగులు
- స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- యువత కలలకు వనరుల కొరత రానివ్వం
- మావోయిజంతో యువత భవిష్యత్ నాశనం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ఎగురవేసిన ప్రధాని
- అనంతరం జాతిని ఉద్దేశించి ప్రసంగం
- ఘనంగా భారత 80వ స్వాతంత్య్ర దినోత్సవం

**కాకతీయ, న్యూఢిల్లీ :**

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు చిన్న కలలు ఇక సరిపోవని, ప్రతి ఒక్కరూ పెద్ద కలలు కనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పంతో దేశం వివిధ రంగాల్లో సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోందని అన్నారు. భారత్ ఎవరి మీద ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తూ వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తిని ప్రతి భారతీయుడు అందిపుచ్చుకోవాలని కోరారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దిల్లీలోని ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ఎగురవేసిన అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. దేశం తన కలలు, ఆశయాల ప్రాతిపదికన ముందుకు సాగినప్పుడే గొప్పదిగా మారుతుందని మోదీ అన్నారు. ప్రతి హృదయంలో వందేమాతరం మార్మోగుతోందని, ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోందని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎర్రకోట ప్రాకారం నుంచి వందేమాతరం మార్మోగడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అత్యధిక జనాభా కలిగిన భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం భారత్ వైపు చూసే దృక్పథం కచ్చితంగా మారుతుందని అన్నారు. పాత శతాబ్దపు చట్టాలపై ఆధారపడి 21వ శతాబ్దంలో భారత్ ముందుకు సాగలేదని, ప్రస్తుత విజయాలను చూస్తే 2047 నాటికి వికసిత్ భారత్ సంకల్పం నెరవేరకుండా ఉండదని ధీమా వ్యక్తం చేశారు.

**ఇంధన భద్రతపై ప్రత్యేక దృష్టి**

దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చే దిశగా సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, ఇప్పటికే

........(తరువాయి 8లో)



## రోడ్డు ప్రమాదంలో వరంగల్ డీఎంవో సురేఖ మృతి

- ఆమెతో పాటు సమీప బంధువు సైతం మృత్యువాత
- తాడ్వాయి–పస్రా మధ్య కారును ఢీకొట్టిన ఇసుక లారీ
- నుజ్జునుజ్జయిన కారు.. అక్కడికక్కడే ఇద్దరి మృతి
- ఎనిమిది నెలల క్రితం భర్తను.. రెండేళ్ల క్రితం కుమారుడిని కోల్పోయిన సురేఖ

4

## యూనిఫామ్ కొలువులకు.. ఏడేళ్ల ఊరట!

- యూనిఫామ్ సర్వీసుల్లో గరిష్ఠ వయోపరిమితికి మరో రెండేళ్ల పెంపు
- ఇప్పటికే ఉన్న ఐదేళ్ల సడలింపుతో మొత్తం ఏడేళ్లకు చేరిక
- పోలీస్, ఫైర్, జైళ్లు, ఎక్సైజ్, అటవీ తదితర శాఖలకు వర్తింపు
- వయసు దాటిన వేలాది మందికి మళ్లీ పోటీ చేసే అవకాశం




3

## బీసీ ద్రోహి మల్లన్న.. నీ నడ్డి విరగడం ఖాయం

- దమ్ముంటే నీ పార్టీ బీఫామ్‌పై పోటీ చేయి
- నల్గొండ, మునుగోడులో మీటింగ్ పెట్టు
- నీకు డిపాజిట్ వస్తే ఆలేరులో పోటీ చేయను
- కాంగ్రెస్ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

4

## రైతుబీమాకు బ్రేక్?!

- ఆగస్టు 14 గడువు దాటినా ప్రీమియం చెల్లింపుపై స్పష్టతేదీ?
- రాష్ట్ర వ్యాప్తంగా 42.16 లక్షల మంది రైతుల్లో ఆందోళన
- రూ.5 లక్షల బీమా రక్షణ కొనసాగింపుపై సందిగ్ధత
- రూ.1,400 కోట్ల ప్రీమియం చెల్లింపుపై ప్రభుత్వం స్పందించాలి
- రైతు కుటుంబాలకు భరోసా.. ఇక ఎటు?

రైతుబీమా
RYTHU BIMA
FARMER'S INSURANCE

3

## ఆరేళ్లుగా పాడేరు సోదారుల గంజాయి దందా

- కరోనా కష్టాల్లో మొదలై, హైదరాబాద్‌కు వలస
- 203 మంది కొనుగోలుదారులతో రూ.20.54 లక్షల లావాదేవీలు
- ఈగల్ ఫోర్స్ దర్యాప్తులో వెలుగులోకి కొత్త కోణాలు..వివరాలు
- ఒడిశా సరఫరాదారులపై ప్రత్యేక దర్యాప్తు
- బాలానగర్ పోలీసుల సంబంధాలపైనా విచారణ

2


EAGLE
Elite Action Group
For Drug Law Enforcement

## రేవంత్..! రుణమాఫీ లెక్క చెప్పు

- 100 శాతం జరిగిందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- లేదంటే సీఎం పదవికి రాజీనామా చేస్తావా..?!
- గన్‌మెన్లను వదిలి నిరుద్యోగుల ముందుకు రండి
- సింగూరు, సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను గాలికొదిలేశారు
- కాంగ్రెస్ హామీలన్నీ మోసాలే.. : మాజీ మంత్రి హరీశ్‌రావు



2



## విజయ్‌త్రిష.. మళ్లీ హాట్‌టాపిక్!

- విజయ్ తల్లిదండ్రుల పక్కనే త్రిష.. వైరల్‌గా మారిన దృశ్యాలు
- స్వాతంత్ర్య వేడుకల్లో ముందు వరుసలో కూర్చున్న నటి
- ఓపెన్ వెహికల్‌లో వెళ్తున్న విజయ్‌కు త్రిష సెల్యూట్
- విజయ్ కుటుంబంతో త్రిష సాన్నిహిత్యంపై నెటిజన్ల చర్చ

8

## సీఎం పర్యటనకు ముస్తాబైన ములుగు

- రూ.16,007 కోట్ల రహదారి అభివృద్ధికి నేడు శ్రీకారం
- గట్టమ్మ ఆలయం వద్ద రూ.868 కోట్ల అభివృద్ధి పనుల పైలాన్ ఆవిష్కరణ
- రూ.63.50 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్‌కు ప్రారంభోత్సవం
- మేడారంలో వనదేవతలను దర్శించుకోనున్న సీఎం
- అక్కడి నుంచే చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ




2



# రేషన్ కార్డు పేదల ఆత్మగౌరవం

- సన్నబియ్యంతో ప్రతి పేద కుటుంబానికి భరోసా
- రైతు భరోసాతో అన్నదాతకు అండ
- 2 ఏళ్లలో 7 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు
- 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- బీజేపీ, బీఆర్ఎస్ నాణేనికి బొమ్మా బొరుసు
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**

రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు రేషన్ షాపులను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. సన్నబియ్యాన్ని ప్రతి పేద కుటుంబానికి అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, నవీన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, ఫహీం, గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి

........(తరువాయి 2లో)

# చేరికలతో కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం

- పార్టీకి ద్రోహం చేసిన వారిని ఎలా చేర్చుకుంటారు
- కార్యకర్తలను విస్మరిస్తే కోలుకోలేని దెబ్బ
- కేసీఆర్ చేసిన తప్పులనే కాంగ్రెస్ చేస్తోంది
- మహేష్‌కుమార్‌గౌడ్ సీఎంకు సలహాలు ఇవ్వాలి
- పార్టీలో ఉండలేకపోతే దర్జాగా బయటకు వెళ్లొచ్చు
- కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించి ఇతర పార్టీల నుంచి నాయకులను చేర్చుకోవడం వల్ల కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం జరుగుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని తిరిగి పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన తప్పులనే ఇప్పుడు కాంగ్రెస్ నాయకత్వం కూడా పునరావృతం చేస్తోందని ఆరోపించారు. పార్టీలో చేరికల విషయంలో జరుగుతున్న పరిణామాలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తనకు హితవు పలకడం కంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సలహాలు ఇవ్వాలని సూచించారు. మీనాక్షి నటరాజన్‌కు తనపై ఫిర్యాదులు

........(తరువాయి 2లో)

# రేషన్ కార్డు పేదల ఆత్మగౌరవం

**(మొదటిపేజీ తరువాయి)**

ఎ.చంద్రశేఖర్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇవాళ ఒకరు సన్నబియ్యం గురించి, మరొకరు ఇందిరమ్మ ఇళ్ల గురించి, ఇంకొకరు ఆరోగ్యశ్రీ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ వేర్వేరు కాదని, అవి నాణేనికి బొమ్మా బొరుసులాంటివని విమర్శించారు. ఏనాడైనా సన్నబియ్యం ఇచ్చి పేదల కడుపు నింపాలని ఆలోచించారా అని ఆ పార్టీల నాయకులను ప్రశ్నించారు.

**కరెంటు, ధాన్యం కొనుగోళ్లలో మార్పు**

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు ఉండదని ఆనాడు ప్రచారం చేశారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు అవుతున్నా ఏ ఒక్క క్షణమైనా కరెంటు పోయిందా అని ప్రశ్నించారు. ప్రతి పల్లెలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నది నిజం కాదా అని నిలదీశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు వ్యవసాయానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆనాడు వరి వేసుకుంటే ఉరే అని మాట్లాడినవారు ఇప్పుడు సన్నధాన్యం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్న వాస్తవం ప్రజల కళ్ల ముందే ఉందన్నారు. రైతు భరోసా మొత్తాన్ని రూ.2 వేలు పెంచి ఏడాదికి రూ.12 వేలు అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటివరకు రూ.36 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేసి రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. 32 నెలల్లో రైతులు పండించిన ధాన్యానికి రూ.90 వేల కోట్లు రైతుల ఖాతాలకు బదిలీ చేశామని తెలిపారు. రైతులను రాజులుగా గౌరవించే సంస్కృతి తమ ప్రభుత్వంలో ఉందన్నారు. 2.5 ఏళ్లలో రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని గర్వంగా చెబుతున్నానన్నారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సవాల్ విసిరారు. శాసనసభకు వచ్చి రైతులకు తాము చేసిన మేలు ఏమిటో, గతంలో మీరు చేసిన అన్యాయం ఏమిటో చర్చిద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణలో రుణం లేని రైతులు ఉన్నారని కేంద్ర ప్రభుత్వ నివేదికలు చెబుతున్నా బీజేపీ నాయకులకు అవి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతుల సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వం వెనక్కి తగ్గబోదన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు సొంత గూడు**

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పినవారు ఏ ఒక్కరికైనా ఇచ్చారా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అయితే పేదల తమ్ముడిగా తాను 2 ఏళ్లలో 7 లక్షల ఇళ్లను మంజూరు చేశానని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదని, ఇకపై ఉండదని స్పష్టం చేశారు. పేదలకు సొంత గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒంటరి మహిళలందరికీ పెన్షన్లు ఇచ్చి ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు. చేనేత, గీత కార్మికులకు కూడా పెన్షన్లు అందిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారికి పెన్షన్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆహార భద్రతతో పాటు పేదలకు ఇళ్లు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**యువతకు ఉద్యోగాలు,**
**భవిష్యత్తుకు భరోసా**

2.5 ఏళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. నిరుద్యోగ యువత మాయ మాటలు చెప్పే వారి ఉచ్చులో పడవద్దని సూచించారు. ప్రతి 6 నెలలకు ఎప్పటికప్పుడు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు నిలబడే నాయకత్వం కాంగ్రెస్ నాయకత్వమని అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదేనని చెప్పారు. దుర్మార్గులు రాజకీయం కోసం, అధికారం కోసం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వారి మాయలో పడకుండా ఉద్యోగ పరీక్షలకు సిద్ధం కావాలని యువతకు సూచించారు. ప్రజల హక్కులను కాదనబోమని, అవకాశాలను తొలగించబోమని స్పష్టం చేశారు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని యువతకు మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు ఉద్యోగ నియామక ప్రక్రియను కొనసాగిస్తామన్నారు.

**కుట్రలు చేసినా ప్రజల ఆశీర్వాదమే**

ప్రభుత్వంపై కొంతమంది అఘోరా పూజలు, చేతబడులు చేస్తున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఎవరైనా ప్రజలపై చేతబడులు చేస్తారా అని ప్రశ్నించారు. నిజాలు చెబితే తమ మహేష్‌కుమార్‌గౌడ్‌కు నోటీసులు ఇస్తున్నారని అన్నారు. అడుగు పెడితే సామాజిక మాధ్యమాల్లో పెట్టే వారు తమిళనాడులో గుడులకు వెళ్లిన విషయం ఎందుకు రహస్యంగా ఉంచారని ప్రశ్నించారు. వాళ్లు ఎన్ని క్షుద్ర పూజలు చేసినా దేవుడి ఆశీర్వాదం తమపై ఉందన్నారు. అందుకే ఎల్‌నినో కరువులోనూ ఎల్లంపల్లి నిండిందని వ్యాఖ్యానించారు. దేవుడి ఆశీర్వాదంతో పాటు ప్రజల ఆశీర్వాదం కూడా తమపై ఉండాలని కోరారు. 2034 వరకు తమకు ప్రజల ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి పోటీ చేయాలో వద్దో అనేది ఆయన చేతిలో కూడా లేదని, అది రాహుల్‌గాంధీ చేతిలోనే ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాహుల్‌గాంధీ రాముడు అయితే జగ్గన్న హనుమంతుడి లాంటి వాడని పేర్కొన్నారు. ఆ రాముడి మాటను ఈ హనుమంతుడు ఎప్పుడూ జవదాటడని అన్నారు. రూ.100 కోట్లు ఖర్చు పెట్టినా జగ్గారెడ్డి లాంటి నాయకులు దొరకరని కొనియాడారు. ఎన్నికల్లో ఓడిపోయినా కుటుంబాన్ని కూడా వదిలి ప్రజలతోనే ఉంటున్నారని చెప్పారు. తెలంగాణలో జగ్గారెడ్డి లాంటి నాయకుడు లేడన్నారు. అలాంటి నాయకులు ప్రజా జీవితంలో ఉండాలని, జగ్గారెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, నవీన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, ఫహీం, గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# చేరికలతో కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం

**(మొదటిపేజీ తరువాయి)**

చేసినా తాను ఏమాత్రం భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేవలం పదవుల కోసం పార్టీ సిద్ధాంతాలను పక్కన పెట్టడం సరికాదన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకుని పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతోమంది కార్యకర్తలు ప్రాణాలొడ్డి పనిచేశారని గుర్తుచేశారు. అలాంటి వారిని కాదని బయటి నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేయడం సరికాదన్నారు. పార్టీ ప్రయోజనాల కోసమే తాను ఈ వ్యాఖ్యలు చేస్తున్నానని, తన పదవి కోసం కాదని స్పష్టం చేశారు.

**ద్రోహులను ఎలా చేర్చుకుంటారు**

పార్టీకి ద్రోహం చేసిన వారిని తిరిగి కాంగ్రెస్‌లోకి ఎలా ఆహ్వానిస్తారని రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. సీపీఐ మద్దతు బలంగా ఉన్నప్పటికీ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి లాగాల్సిన అత్యవసర పరిస్థితి ఏమొచ్చిందని నిలదీశారు. గతంలో అసెంబ్లీ స్పీకర్‌గా వ్యవహరించి కాంగ్రెస్ పార్టీ పతనానికి కారణమైన వ్యక్తులను మళ్లీ పార్టీలోకి చేర్చుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో కీలక పాత్ర పోషించిన నేతలకు ఇప్పుడు పార్టీలో పెద్దపీట వేయడంపై మండిపడ్డారు. పార్టీలో చేరిన తర్వాత కూడా కొందరు నేతలు తమ పాత పద్ధతులను వీడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను నమ్మి పనిచేయడం ఇష్టం లేని వారు పార్టీలో కొనసాగాల్సిన అవసరం లేదని, దర్జాగా బయటకు వెళ్లవచ్చని సూటిగా చెప్పారు. పార్టీ కోసం పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు లభించకపోవడం బాధాకరమన్నారు. చేరికల విధానాన్ని మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తాను ఎవరి వ్యక్తిగత విమర్శలు చేయడం లేదని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ప్రయోజనాల కోసమే మాట్లాడుతున్నానని తెలిపారు. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఉద్యమకారులు, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరిగేలా నాయకత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**చిల్లర రాజకీయాలతో గౌరవం పోతుంది**

దానం నాగేందర్ వ్యవహారశైలిని ఉదహరిస్తూ రాజగోపాల్‌రెడ్డి రాజకీయాల తీరుతెన్నులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీ టికెట్‌పై పోటీ చేయడం ఏ రకమైన రాజకీయమని ప్రశ్నించారు. ఇప్పటికీ తాను వేరే పార్టీలోనే ఉన్నానని కొందరు నేతలు బహిరంగంగా ప్రకటించడం ప్రజల్లో నవ్వులపాలవుతోందని ఎద్దేవా చేశారు. ఇలాంటి చిల్లర రాజకీయాల వల్ల ప్రజల్లో రాజకీయ నాయకుల పట్ల ఉన్న గౌరవం మసకబారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా నష్టపరిచిన వ్యక్తులను తిరిగి పార్టీలోకి తీసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. చేరికల వ్యవహారంపై హైకమాండ్‌కు అన్నీ తెలిసినా మౌనం వహించడం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత అధిష్టానంపై ఉందని గుర్తుచేశారు. ఇప్పటికైనా చేరికల అంశంపై పునరాలోచించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా అధికార సమీకరణాల కోసం ఇతర పార్టీల నాయకులను తీసుకురావడం వల్ల కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి పెరుగుతోందన్నారు. ఈ అసంతృప్తిని వెంటనే తొలగించేలా పార్టీ పెద్దలు చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తు రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని తప్పులను ఇప్పటికైనా సరిదిద్దుకోవాలని సూచించారు.



**మహేష్‌కుమార్‌గౌడ్ సీఎంకు చెప్పాలి**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తనకు హితవు పలికే బదులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సలహాలు ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. పార్టీలో జరుగుతున్న తప్పులను సరిదిద్దాలని సీఎంకు చెప్పాల్సిన బాధ్యత పీసీసీ అధ్యక్షుడిపై ఉందన్నారు. చేరికల విషయంలో జరుగుతున్న తప్పుల వల్ల పార్టీ గౌరవం మంటగలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను చేసే ప్రతి వ్యాఖ్య పార్టీకి మేలు చేస్తుందే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేయదని స్పష్టం చేశారు. కేవలం తన పదవి కోసం కాకుండా పార్టీ భవిష్యత్తు కోసమే తాను గళం వినిపిస్తున్నానని వెల్లడించారు. కార్యకర్తల మనోభావాలను గౌరవించని పరిస్థితులు కొనసాగితే పార్టీకి కోలుకోలేని దెబ్బ తగులుతుందని హెచ్చరించారు. నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**ఒత్తిళ్లకు భయపడేది లేదు**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన కార్యకర్తల త్యాగాలను నాయకత్వం గుర్తించాలని రాజగోపాల్‌రెడ్డి కోరారు. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారిని విస్మరించి బయటి నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీకి భవిష్యత్తులో నష్టం తప్పదన్నారు. పార్టీ శ్రేణుల్లో నెలకొన్న అసంతృప్తిని వెంటనే దూరం చేయాలని సూచించారు. తనపై ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మీనాక్షి నటరాజన్‌కు తనపై ఫిర్యాదులు చేసినా తాను భయపడబోనన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత పటిష్టం చేసేందుకే తాను విమర్శలు చేస్తున్నానని పునరుద్ఘాటించారు. పార్టీ ప్రయోజనాలే తనకు అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. చేరికలపై కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న ఈ అంతర్గత విభేదాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

# ఆరేళ్లుగా పాడేరు సోదరుల గంజాయి దందా

**కాకతీయ, హైదరాబాద్:** కరోనా సమయంలో లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో పడిన పాడేరు సోదరులు దుర్గాప్రసాద్, కమలాకర్, కిరణ్ గంజాయి విక్రయాల వైపు వెళ్లారు. అరకు ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయించడం ప్రారంభించారు. గంజాయి విక్రయాల కేసుల్లో అరెస్టయినా దందాను కొనసాగించారు. స్థానికంగా కొందరు యువకులతో గంజాయి సరఫరా చేయించినట్లు పోలీసులు గుర్తించారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి విక్రయాల కేసులో నిందితుల నేర చరిత్రపై ఈగల్ ఫోర్స్ దర్యాప్తు చేయగా ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులను బెదిరించేందుకు తుపాకీ సమకూర్చుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఇటీవల అరెస్టు చేసేందుకు వెళ్లిన ఈగల్ బృందంపై కుక్కను వదిలి దాడికి పాల్పడిన కేసులో ఈ సోదరులు నిందితులుగా ఉన్నారు. దాదాపు ఆరేళ్లుగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు స్థానికంగా యువకులను గంజాయి విక్రయాలకు ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది.

**పాడేరు నుంచి హైదరాబాద్‌కు**

ఆంధ్రప్రదేశ్‌లోని పాడేరుకు చెందిన దుర్గాప్రసాద్, కమలాకర్, కిరణ్ సోదరులు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. బాలానగర్ ప్రాంతంలో ఉంటూ కేటరింగ్ వ్యాపారం చేసేవారు. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో గంజాయి రవాణాపై దృష్టి సారించారు. తమ స్వస్థలానికి సమీపంలోని ఏవోబీ సరిహద్దుల్లో గంజాయి రవాణా జరుగుతుండటాన్ని గుర్తించారు. అరకు నుంచి గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని భావించి దందా ప్రారంభించారు. కిలో గంజాయిని రూ.3,000కు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చేవారు. అనంతరం 15 గ్రాముల పొట్లాలను తయారు చేసి ఒక్కో పొట్లాన్ని రూ.500కు విక్రయించేవారు. మూసాపేట, భరత్‌నగర్, సనత్‌నగర్, బోయిన్‌పల్లి పరిసర ప్రాంతాల్లో విక్రయాలు సాగించేవారు. 2020లో బాలానగర్ ఆబ్కారీ పోలీసులు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేశారు. కిరణ్ వద్ద కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా గంజాయి విక్రయాలను కొనసాగించారు.



**యువకులతో సరఫరా**

కేటరింగ్ వ్యాపారం చేస్తున్నట్లు స్థానికంగా చెప్పుకుంటూ గంజాయి విక్రయాలు సాగించేవారు. కొందరు యువకులకు గంజాయి అలవాటు చేసి, వారి ద్వారా విక్రయాలు, సరఫరా చేయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో రాచకొండ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై గంజాయి విక్రయాలు సాగించినట్లు దర్యాప్తులో తేలింది. ఏడాది వ్యవధిలో రూ.20 లక్షల విలువైన గంజాయి లావాదేవీలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల ఫోన్లను విశ్లేషించగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పలువురు గంజాయి కొనుగోలు చేసినట్లు తేలింది. వీరు హైదరాబాద్‌లో నిందితుల వద్ద గంజాయి కొనుగోలు చేశారా, ఆయా రాష్ట్రాలకు గంజాయి తెప్పించుకున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**203 మంది కొనుగోలుదారులు**

ఇప్పటివరకు 203 మంది గంజాయి కొనుగోలుదారులను పోలీసులు గుర్తించారు. దుర్గాప్రసాద్, కమలాకర్, కిరణ్‌తో 203 మంది రూ.20.54 లక్షల నగదు లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. కర్ణాటకకు చెందిన పిచ్చుకల సంజీవ్‌కుమార్ పేరిట ఉన్న వ్యక్తితో రూ.3.6 లక్షల విలువైన 239 లావాదేవీలు జరిగినట్లు ఫోన్, నగదు లావాదేవీల విశ్లేషణలో తేలింది. గంజాయి కొనుగోలుదారుల్లో పలువురు మహిళలు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు తమ పేర్లకు బదులుగా కృష్ణవేణి, హారిక పేర్లతో ఉన్న బ్యాంకు ఖాతాలను ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. గంజాయి కొనుగోలుదారులు పంపిన డబ్బు ఆ రెండు ఖాతాల్లో జమ అయినట్లు పోలీసులు గుర్తించారు. హారిక కిరణ్ భార్యగా గుర్తించారు. కృష్ణవేణి ఎవరనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద తరచూ గొడవలు జరిగేవని స్థానికులు తెలిపారు. గొడవలపై ఇంటి యజమాని ప్రశ్నించగా ఆయన్నే తిరిగి బెదిరించినట్లు చెప్పారు. నిందితులు ఒడిశాకు చెందిన వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో సరఫరాదారుల వివరాలను పోలీసులు సేకరించారు. వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని ఒడిశాకు పంపించారు. గంజాయి సరఫరా ఎక్కడి నుంచి జరుగుతోంది, ఎవరెవరు నిందితులకు గంజాయి అందిస్తున్నారు, రవాణాలో మరెవరైనా ఉన్నారా అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల ఫోన్ కాల్స్, బ్యాంకు లావాదేవీలు, కొనుగోలుదారుల వివరాలను పరిశీలిస్తున్నారు.

**బాలానగర్ పోలీసులపై విచారణ**

గంజాయి విక్రేతలతో కొందరు పోలీసులకు ఉన్న సన్నిహిత సంబంధాల వ్యవహారంపైనా విచారణ కొనసాగుతోంది. బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లకు నిందితులతో మంచి సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. నిందితులతో సన్నిహితంగా మెలిగిన పోలీసుల గురించి పూర్తిస్థాయి సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఈగల్ బృందం బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు సేకరించింది. కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను విచారించింది. నిందితులతో పోలీసులకు ఉన్న సంబంధాలు, గంజాయి విక్రయాలపై వారికి ఏమైనా సమాచారం ఉందా, నిందితులకు ఎవరైనా సహకరించారా అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. గంజాయి విక్రయాల ముఠా, దాని సరఫరాదారులు, కొనుగోలుదారులు, నిందితులకు సహకరించిన వ్యక్తుల వివరాలను పూర్తిగా వెలికితీసే పనిలో ఈగల్ ఫోర్స్ నిమగ్నమైంది.

## సీఎం పర్యటనకు ముస్తాబైన ములుగు

**కాకతీయ, ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా చరిత్రలో మరో కీలక ఘట్టానికి వేదిక కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో మేడారం నుంచి ములుగు వరకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణం, గట్టమ్మ ఆలయ సమీపంలోని పైలాన్ ప్రాంతం, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, హెలిప్యాడ్లు, సీఎం ప్రయాణించే మార్గాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**రూ.16,007 కోట్ల రహదారులకు శ్రీకారం:** గ్రామీణ రహదారుల అభివృద్ధిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న భారీ కార్యక్రమానికి ములుగు వేదిక కానుంది. రూ.16,007 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధి కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ములుగు నుంచి ప్రారంభించనున్నారు. తొలి దశలో 2,145 రహదారులను 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. గట్టమ్మ ఆలయ సమీపంలో ఇందుకు గుర్తుగా భారీ పైలాన్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలు, అలంకరణలు, పారిశుధ్యం, ల్యాండ్‌స్కేపింగ్‌తో పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వీఐపీ రాకపోకలు, పార్కింగ్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను పూర్తి చేశారు.

**రూ.868 కోట్ల పనుల పైలాన్:** ములుగు జిల్లాలో చేపట్టిన రూ.868 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులను ప్రతిబింబించే మరో పైలాన్‌ను సీఎం ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం నూతన కలెక్టరేట్ సమీపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పైలాన్ పరిసరాల్లో విద్యుత్ దీపాల అలంకరణ, పారిశుధ్యం, పార్కింగ్, బారికేడింగ్ తదితర పనులను పూర్తి చేశారు. రూ.63.50 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కలెక్టర్ ఛాంబర్, సమావేశ మందిరం, వివిధ శాఖల కార్యాలయాలు, విద్యుత్, జనరేటర్, తాగునీరు, పార్కింగ్ తదితర సౌకర్యాలతో భవనాన్ని నిర్మించారు. పరిసరాల్లో ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్ దీపాల అలంకరణ, పారిశుధ్య పనులను పూర్తి చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీస్ బందోబస్తు, బారికేడింగ్, అగ్నిమాపక వాహనాలు, వైద్య బృందాలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు.

**మేడారంలో వనదేవతల దర్శనం:** ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మేడారంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హెలిప్యాడ్ నుంచి సమ్మక్క-సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణం వరకు రహదారులను సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంలో బారికేడింగ్, క్యూలైన్లు, వీఐపీ, వీవీఐపీ ఏర్పాట్లు, భద్రతా సిబ్బంది, అత్యవసర మార్గాలు, విద్యుత్, తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. నిర్మాణ వ్యర్థాలు, గ్రానైట్ రాళ్లను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ల్యాండ్‌స్కేపింగ్, మొక్కలు, పూలతో ప్రాంగణాన్ని సుందరీకరించారు. మేడారం వేదికగా చేయూత పింఛన్ల లబ్ధిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు పత్రాలను అందజేయనున్నారు. లబ్ధిదారులకు కూర్చునే సదుపాయం, తాగునీరు, వైద్య సహాయం తదితర ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్‌ను కూడా సీఎం ప్రారంభించనున్నారు.

**పర్యటన షెడ్యూల్ ఇదీ..:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు మేడారం చేరుకుంటారు. 1.40 నుంచి 1.50 గంటల వరకు సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి, ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. 2.20 గంటలకు ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి గట్టమ్మ ఆలయ సమీపంలోని పైలాన్ వద్దకు చేరుకుని 2.30 గంటలకు రూ.16,007 కోట్ల రహదారి అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. 2.40 గంటలకు రూ.868 కోట్ల అభివృద్ధి పనుల పైలాన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం రూ.63.50 కోట్లతో నిర్మించిన నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారు. కార్యక్రమాలు ముగించుకుని 3 గంటలకు ములుగు డిగ్రీ కళాశాల హెలిప్యాడ్ నుంచి హనుమకొండ జిల్లా పరకాల పర్యటనకు బయలుదేరుతారు.

**పటిష్ట భద్రత.. సర్వం సిద్ధం:** సీఎం పర్యటన నేపథ్యంలో మేడారం నుంచి ములుగు వరకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బారికేడింగ్, అగ్నిమాపక, వైద్య, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

## రేవంత్..! రుణమాఫీ లెక్క చెప్పు

**కాకతీయ, సిద్దిపేట :** రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లికి ఇద్దరం ఎలాంటి భద్రతా సిబ్బంది లేకుండా వెళ్దామని, అక్కడ 100 శాతం రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. ఒకవేళ రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మోసం చేసిందని తేలితే ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య దినోత్సవం వంటి పవిత్రమైన జాతీయ పండుగ రోజున కూడా ముఖ్యమంత్రి రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమన్నారు. రాజకీయ లబ్ధి కోసమే సీఎం సభలో అవాస్తవాలు మాట్లాడారని ఆరోపించారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు లెక్కలేనన్ని హామీలు ఇచ్చి ఘోరంగా మోసం చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన వేళ స్థానిక సమస్యలు, ప్రాజెక్టుల గురించి మాట్లాడకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడమే సీఎం పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. సాయంత్రం 4 గంటల 20 నిమిషాలకు ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభం కావడం కూడా రాజకీయ వ్యంగ్యంగా మారిందని వ్యాఖ్యానించారు.

**ప్రాజెక్టులను గాలికొదిలేశారు:** ఉమ్మడి మెదక్ జిల్లాకు కీలకమైన సింగూరు, సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నప్పటికీ పనులను నిలిపివేసి అన్నదాతల కడుపు కొడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ప్రాజెక్టుల ప్రగతిని విస్మరించి కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితం కావడం దురదృష్టకరమన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘరానా మోసానికి పాల్పడిందని హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. దేవుళ్లపై ఒట్లు వేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు పొంతన లేదన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందని ప్రభుత్వం నిరూపించాలని డిమాండ్ చేశారు.

**ఉద్యోగాల భర్తీపై పచ్చి అబద్ధాలు:** నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలు పచ్చి అబద్ధాలని హరీశ్‌రావు ఆరోపించారు. శాసనసభలో ప్రభుత్వం స్వయంగా ఇచ్చిన సమాచారం ప్రకారం కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశామని చెప్పి, బహిరంగ సభల్లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ పచ్చి అబద్ధాలకు నిరుద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే గన్‌మెన్లను వదిలేసి అశోక్‌నగర్‌కు లేదా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వచ్చి నిరుద్యోగుల ముందు మాట్లాడాలని ముఖ్యమంత్రికి హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం చెప్పే లెక్కలను నిరుద్యోగులు, ప్రజలు నమ్మడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కొత్త కొత్త ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

**రుణమాఫీపై లెక్కలు తేల్చాలి:** రుణమాఫీ పేరుతో శాసనసభలో 35 వేల కోట్లు కేటాయించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం కేవలం 20 వేల కోట్లు మాత్రమే విడుదల చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. కేటాయింపులు, విడుదల చేసిన నిధులకు మధ్య ఉన్న వ్యత్యాసంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందని చెబుతున్న ముఖ్యమంత్రి తన సవాల్‌ను స్వీకరించి వాస్తవాలను ప్రజల ముందు నిరూపించాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేదికను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

# నాపై చేసిన ఆరోపణలు నిరూపించాలి

**ఆధారాలు చూపకపోతే రేవంత్‌పై పరువునష్టం దావా**

**పంద్రాగస్టు ప్రసంగంపై మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం**

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై నిలదీత**

**సింగూరు, సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టులపై ప్రశ్నలు**



కాకతీయ, సిద్దిపేట : తనపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను నిరూపించాలని, లేకపోతే పరువునష్టం దావా వేసి కోర్టుకు ఈడుస్తానని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు హెచ్చరించారు. ఆధారాలు లేకుండా తనపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, చేసిన ఆరోపణలకు సాక్ష్యాలు చూపకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంపై సిద్దిపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. అబద్ధాన్ని పదేపదే చెబితే నిజం కాదని.. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.స్వాతంత్ర్య దినోత్సవం రోజున స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించి మాట్లాడాల్సిన సీఎం.. రాజకీయ విమర్శలకే ప్రాధాన్యమివ్వడం విచారకరమని హరీశ్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తమ పార్టీ తరపున రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు, రాష్ట్ర ప్రజల సమస్యలను ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని, లేనిపక్షంలో చట్టపరంగా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**'సింగూరు'పై సమాధానం ఏది?**

సంగారెడ్డి పర్యటనకు వచ్చిన సీఎం.. జిల్లాలోని తాగునీటి సమస్య, కొత్త అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై ఎలాంటి హామీ ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాల కారణంగా సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గి మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తాగునీటి సమస్య ఏర్పడిందని ఆరోపించారు. నారాయణఖేడ్ ప్రాంతంలో రెండు, మూడు రోజులకొకసారి నీటి సరఫరా జరుగుతోందని అన్నారు. సాగునీటి అవసరాల కోసం గత ప్రభుత్వం చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జిల్లాకు వచ్చిన సీఎం.. ఆ ప్రాజెక్టుల పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తామని ప్రకటిస్తారని ప్రజలు ఆశించారని, కానీ అందుకు భిన్నంగా ప్రసంగం సాగిందని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని సీఎం చెబుతున్నారని.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని హరీశ్‌రావు అన్నారు. అనేక ప్రాంతాల్లో రైతులకు 12 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. విద్యుత్ కోసం రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. "ప్రజలు మీ మాటలను నమ్మే పరిస్థితిలో లేరు. బీఆర్ఎస్ నేతలను విమర్శిస్తే మీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు మరిచిపోతారని అనుకోవద్దు" అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సంగతేంటి?**

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కూడా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇకపై ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని.. గత రెండున్నరేళ్ల బకాయిల సంగతేంటని ప్రశ్నించారు. ఆ కాలంలో ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్నది రేవంత్‌రెడ్డేనని గుర్తుచేశారు. బకాయిల కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.19,700 కోట్లు విడుదల చేశామని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.1,400 కోట్లను కూడా తాము చెల్లించామని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తనపై, తన ప్రభుత్వంపై క్షుద్రపూజలు చేస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా హరీశ్‌రావు స్పందించారు. అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే రాజకీయ విమర్శలు చేయడం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని అన్నారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలని, లేదంటే పరువునష్టం దావాతో కోర్టులోనే తేల్చుకుంటానని హరీశ్‌రావు మరోసారి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, ఆధారాలు లేని ఆరోపణలతో తమ గొంతు నొక్కలేరని అన్నారు.

# బీట్ ఆఫీసర్ మృతికి కారణమైన నలుగురు అరెస్టు!

**వన్యప్రాణుల వేటకు అక్రమ విద్యుత్ తీగలు**

**కరెంట్ షాక్‌తో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతి**

**బైండింగ్ వైరు, గడ్డపలుగు, మద్యం సీసాలు స్వాధీనం**



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ మృతికి కారణమైన నలుగురు నిందితులను బూర్గంపాడు పోలీసులు అరెస్టు చేశారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబు, నాగినేని ప్రోలు రెడ్డిపాలెంకు చెందిన కన్నెదారి అనంతయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి బైండింగ్ వైరు, గడ్డపలుగు, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 11న రాత్రి నకిరేపేట అటవీ ప్రాంతంలో అక్రమ విద్యుత్ తీగల కారణంగా బీట్ ఆఫీసర్ నవీన్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ప్రత్యేక బృందాలతో గాలింపు నిర్వహించి నిందితులను పట్టుకున్నారు.

**వేటకు విద్యుత్ తీగలు**

నకిరేపేట అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో బీట్ ఆఫీసర్ నవీన్ అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై మృతి చెందారు. కర్తవ్య నిర్వహణలో ఉన్న అటవీ ఉద్యోగి ప్రాణాలు కోల్పోవడంతో ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీఆర్వో అనార్కలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు బాధ్యులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నలుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి వేటకు ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? వన్యప్రాణుల వేటకు ఇలాంటి విద్యుత్ ఉచ్చులను ఇంకా ఎక్కడైనా ఏర్పాటు చేశారా? అన్న కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం అత్యంత ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. ఇలాంటి చర్యలతో జంతువులతోపాటు అడవుల్లో విధులు నిర్వహించే సిబ్బంది, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసి వేటకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అరెస్టయిన నలుగురు నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

# రైతుబీమాకు బ్రేక్?!

**ఆగస్టు 14 గడువు దాటినా ప్రీమియం చెల్లింపుపై స్పష్టతేదీ?**

**రాష్ట్ర వ్యాప్తంగా 42.16 లక్షల మంది రైతుల్లో ఆందోళన**

**రూ.5 లక్షల బీమా రక్షణ కొనసాగింపుపై సందిగ్ధత**

**రూ.1,400 కోట్ల ప్రీమియం చెల్లింపుపై ప్రభుత్వం స్పందించాలి**

**రైతు కుటుంబాలకు భరోసా.. ఇక ఎటు?**

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి : రైతు కుటుంబానికి అకాల మరణం సంభవిస్తే ఆర్థికంగా అండగా నిలిచే రైతుబీమా పథకం 2026–27లో కొనసాగింపుపై అనిశ్చితి నెలకొంది. ఈ ఏడాదికి బీమా ప్రీమియం చెల్లించాల్సిన గడువు ఆగస్టు 14తో ముగిసినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించిందా? లేదా? అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 42.16 లక్షల మంది రైతులకు ఈ పథకం కవరేజీ ఉంది. అకాల మరణం సంభవించినప్పుడు కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందేలా ఈ పథకాన్ని 2018లో ప్రారంభించారు. రైతుబీమా పథకంలో ప్రతి ఏడాది ప్రభుత్వం బీమా సంస్థకు ప్రీమియం చెల్లిస్తూ రైతులకు బీమా రక్షణ కల్పిస్తోంది. 2026–27 సంవత్సరానికి సుమారు రూ.1,400 కోట్ల ప్రీమియం చెల్లించాల్సి ఉందని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే ఆగస్టు 14 గడువు ముగిసే నాటికి చెల్లింపు జరగలేదని సమాచారం. దీంతో కొత్త బీమా కాలంలో రైతుల కవరేజీ పరిస్థితిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ప్రీమియం చెల్లింపులో జాప్యం జరిగిందని మాత్రమే చెప్పి వెంటనే రైతుబీమా ప్రయోజనాలు నిలిచిపోయాయని నిర్ధారించలేం. ప్రభుత్వం ప్రీమియం చెల్లించి కవరేజీని కొనసాగించే అవకాశం ఉంది.

**రూ.5 లక్షల భరోసా ఎటు?**

రైతుబీమా పథకం ఉద్దేశం రైతు అకాల మరణంతో కుటుంబం ఆర్థికంగా కుదేలుకాకుండా తక్షణ సాయం అందించడం. అర్హత కలిగిన రైతు మరణిస్తే కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందేలా పథకాన్ని రూపొందించారు. ఇలాంటి పథకంలో ప్రీమియం చెల్లింపు విషయంలో స్వల్ప జాప్యం జరిగినా.. దాని ప్రభావం నేరుగా రైతు కుటుంబాల భద్రతపై పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందుగానే స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. ముఖ్యంగా కొత్త బీమా కాలంలో జరిగే మరణాలకు క్లెయిమ్ పరిష్కారం ఎలా ఉంటుంది? ఇప్పటికే ఉన్న కవరేజీకి ఎలాంటి అంతరాయం ఉండదా? అనే అంశాలపై రైతులకు సందేహాలు లేకుండా చేయాలి. రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతుబీమా పరిధిలో ఉన్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో రైతులు ఆధారపడిన సామాజిక భద్రతా పథకానికి సంబంధించిన ప్రీమియం చెల్లింపుపై గందరగోళం నెలకొనడం సహజంగానే ఆందోళన కలిగిస్తోంది. రైతుబీమా పథకం ఏ ప్రభుత్వంలో ప్రారంభమైందన్న రాజకీయ చర్చ కంటే.. పథకం కొనసాగుతుందా? రైతు కుటుంబాలకు రూ.5 లక్షల రక్షణ నిరంతరంగా ఉంటుందా? అన్నదే ఇప్పుడు కీలకం. ప్రభుత్వం వెంటనే ప్రీమియం చెల్లింపు స్థితిని వెల్లడించి, రైతుబీమా కవరేజీకి ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేయాలని రైతు వర్గాలు కోరుతున్నాయి.

# రాష్ట్రపతి భవన్‌లో 'ఎట్ హోమ్' రిసెప్షన్

**మోదీ, రాధాకృష్ణన్, కోవింద్, వెంకయ్యానాయుడు హాజరు**

**ప్రముఖులు.. దౌత్యవేత్తలు.. క్రీడాకారులతో సందడి**

**నాలుగు రాష్ట్రాల ఏడు సంప్రదాయ వంటకాలు**




కాకతీయ, న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'ఎట్ హోమ్' రిసెప్షన్ శనివారం వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆతిథ్యమిచ్చిన ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు, దౌత్యవేత్తలు, విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. జాతీయ గీతం 'జనగణమన', 'వందేమాతరం' ఆలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ కార్యక్రమానికి వచ్చిన అతిథులను ఆప్యాయంగా పలకరించారు. మోదీ పలువురు ప్రముఖులతో ముచ్చటిస్తూ కనిపించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన సతీమణి సవితా కోవింద్‌తో కలిసి హాజరయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, రైల్వే, సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తదితరులు పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రముఖ పారా క్రికెటర్ అమీర్ హుస్సేన్ సైతం కార్యక్రమానికి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాజకీయ, సినీ, క్రీడా, దౌత్య రంగాలకు చెందిన ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఈ కార్యక్రమం దేశ వైవిధ్యానికి ప్రతీకగా నిలిచింది.

**నాలుగు రాష్ట్రాల రుచులు**

ఈసారి 'ఎట్ హోమ్' రిసెప్షన్‌లో నాలుగు రాష్ట్రాలకు చెందిన ఏడు సంప్రదాయ వంటకాలను అతిథులకు వడ్డించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఇందోరీ పోహా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చనా దాల్ ముథియా, మిని ఫరా, గోవాకు చెందిన పాతోలియా, దోద్‌ఓల్, కొడో మిల్లెట్ ఖీర్, మహారాష్ట్రకు చెందిన ఖమాంగ్ కకాడీ వంటకాలకు చోటు కల్పించారు. దేశంలోని ప్రాంతీయ రుచులు, ఆహార సంప్రదాయాలను ప్రతిబింబించేలా మెనూను రూపొందించారు. అంతకుముందు శనివారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్‌ను సందర్శించి అమరవీరులకు నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల సేవలను స్మరించుకున్నారు. త్రివిధ దళాల ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**అట్టారీ సరిహద్దులో జోష్**

మరోవైపు 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పంజాబ్‌లోని అట్టారీ–వాఘా సరిహద్దు దేశభక్తి నినాదాలతో మార్మోగింది. గ్రాండ్ బీటింగ్ రిట్రీట్ కార్యక్రమానికి వేలాది మంది హాజరయ్యారు. బీఎస్ఎఫ్ సిబ్బంది నిర్వహించిన సైనిక విన్యాసాలు, హైకిక్‌లు, జిమ్నాస్టిక్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మహిళా బీఎస్ఎఫ్ సిబ్బంది కూడా ప్రదర్శనల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో, త్రివర్ణ అలంకరణలతో సరిహద్దు ప్రాంతం కళకళలాడింది. 'జైహో', 'ఇండియా వాలే', 'దేశ్ మేరా రంగీలా', 'వందేమాతరం' వంటి దేశభక్తి గీతాలతో వాతావరణం మార్మోగింది. గిద్దా, భాంగ్రా వంటి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు వేడుకలకు మరింత వన్నె తెచ్చాయి. విద్యార్థులు, యువత, బీఎస్ఎఫ్ సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జెండా తలకిందులుగా ఎగరేసిన దుగ్గొండి ఎమ్మార్వో

**ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్**

**తహసీల్దార్ ముస్క సమ్మక్క తీరుపై విమర్శలు**



కాకతీయ, వరంగల్ బ్యూరో : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని తలకిందులుగా ఎగురవేసిన ఘటన దుగ్గొండి మండల కేంద్రంలో చర్చనీయాంశమైంది. తహసీల్దార్ ముస్క సమ్మక్క జాతీయ జెండాను ఆవిష్కరించిన సమయంలో పతాకం తలకిందులుగా ఉన్నట్లు స్థానికులు గుర్తించినట్లు సమా చారం. ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దుగ్గొండి మండల కేంద్రం లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, స్థానికుల సమక్షంలో అధికారిక కార్యక్రమం నిర్వహించారు. నిర్ణీత సమయంలో తహసీల్దార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, పతాకం తలకిందులుగా ఉన్న విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. జాతీ య పతాకం విషయంలో ముందస్తుగా తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఈ అంశాన్ని ఎలా గుర్తించలేకపోయారనే ప్రశ్న లు వ్యక్తమవుతున్నాయి. జాతీ య పతాకం దేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగా లకు ప్రతీక అని, దాన్ని ఎగురవేసే సమయంలో అత్యంత జాగ్రత్త అవసరమని స్థానికులు పేర్కొన్నా రు. జెండాను ఎవరు సిద్ధం చేశారు, అధికారులు తనిఖీ చేశారా అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పతాకావిష్కరణ కార్యక్రమాలపై పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# బీసీ ద్రోహి మల్లన్న.. నీ నడ్డి విరగడం ఖాయం

**దమ్ముంటే నీ పార్టీ బీఫామ్‌పై పోటీ చేయి**

**నల్గొండ, మునుగోడులో మీటింగ్ పెట్టు**

**నీకు డిపాజిట్ వస్తే ఆలేరులో పోటీ చేయను**

**కాంగ్రెస్ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**


కాకతీయ, నల్గొండ : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దమ్ముంటే సొంత పార్టీ బీఫామ్‌పై పోటీ చేసి గెలవాలని సవాల్ చేశారు. మల్లన్నకు డిపాజిట్ వస్తే తాను ఆలేరులో పోటీ చేయనని అన్నారు. బీసీ ముసుగులో బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌తో గెలిచిన మల్లన్న ఇప్పుడు అదే పార్టీపై నిందలు వేయడం సరికాదని బీర్ల ఐలయ్య అన్నారు. పేరు, ఊరు, పార్టీ మార్చుకున్న వ్యక్తి మల్లన్న అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ భిక్షతో గెలిచి విర్రవీగుతున్నారని మండిపడ్డారు. నల్గొండ, మునుగోడులో దమ్ముంటే సభ నిర్వహించాలని సవాల్ విసిరారు. ఎదుటి కులాన్ని దూషించే సంస్కారం లేని వ్యక్తి మల్లన్న అని ఐలయ్య విమర్శించారు. బీసీ బిడ్డలపై బలుపు, అహంకారంతో మాట్లాడటం సరికాదన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్న బీసీ ముసుగు బయటపడుతుందని అన్నారు. మల్లన్న తీరును బీసీ సమాజం గమనిస్తోందని ఐలయ్య అన్నారు. బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, బీసీలను అణగదొక్కే విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

# యూనిఫామ్ కొలువులకు.. ఏడేళ్ల ఊరట!

**ఇప్పటికే ఉన్న ఐదేళ్ల సడలింపుతో మొత్తం ఏడేళ్లకు చేరిక**

**పోలీస్, ఫైర్, జైళ్లు, ఎక్సైజ్, అటవీ తదితర శాఖలకు వర్తింపు**

**వయసు దాటిన వేలాది మందికి మళ్లీ పోటీ చేసే అవకాశం**




కాకతీయ, హైదరాబాద్ : యూనిఫామ్ ధరించి ప్రభుత్వ సేవలో చేరాలన్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. పోలీస్, అగ్నిమాపక, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్, రవాణా, అటవీ శాఖల్లోని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని మరో రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా జీవో నంబర్ 122తో ఇప్పటికే అమల్లో ఉన్న ఐదేళ్ల సడలింపునకు మరో రెండేళ్లు కలవడంతో మొత్తం వయోసడలింపు ఏడేళ్లకు చేరింది. నోటిఫికేషన్ల ఆలస్యం, కరోనా అనంతర పరిస్థితులతో అవకాశాలు కోల్పోయిన అభ్యర్థులకు ఈ నిర్ణయం మరోసారి పోటీకి అవకాశం కల్పించనుంది. తాజా నిర్ణయం రాష్ట్రంలోని ప్రధాన యూనిఫామ్ సర్వీసులకు వర్తించనుంది. పోలీస్ శాఖలో సివిల్ ఎస్ఐ, కానిస్టేబుల్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ, కమ్యూనికేషన్స్ పోస్టులతో పాటు అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులకు సడలింపు వర్తిస్తుంది. జైళ్ల శాఖలో డిప్యూటీ జైలర్, వార్డర్ పోస్టులు కూడా ఈ పరిధిలోకి వస్తాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్, రవాణా, అటవీ శాఖల్లోని సంబంధిత డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకూ ఈ సడలింపు వర్తించనుంది.

**ఇప్పటికే ఉన్న సడలింపుపై మరో రెండేళ్లు**

ప్రభుత్వం గతంలోనే మే 18, 2026 నుంచి ఐదేళ్ల వయోపరిమితి సడలింపును అమలు చేస్తోంది. తాజాగా మరో రెండేళ్లు పెంచడంతో సాధారణంగా లభించే అదనపు వయోపరిమితి ఏడేళ్లకు చేరింది. దీంతో గతంలో వయసు కారణంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన అభ్యర్థులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. అయితే పోస్టుల వారీగా ప్రస్తుత నోటిఫికేషన్‌లో పేర్కొనే కటాఫ్ తేదీ, అర్హత నిబంధనలను అభ్యర్థులు తప్పనిసరిగా పరిశీలించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు యూనిఫామ్ సర్వీసులకు వర్తించే ఏడేళ్ల సడలింపుతో పాటు వారి కేటగిరీకి నిబంధనల ప్రకారం లభించే అదనపు వయోసడలింపు కూడా వర్తించనుంది. దీంతో రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులకు మరింత ప్రయోజనం కలగనుంది. ఈ నిర్ణయం భవిష్యత్‌లో జారీ చేసే నోటిఫికేషన్లకే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పోలీస్ నియామక ప్రక్రియకూ తాజా వయోసడలింపు వర్తించనుంది. దీంతో వయసు కారణంగా ఇప్పటికే దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన అభ్యర్థులకు మరో అవకాశం కల్పించే అంశంపై పోలీస్ నియామక మండలి తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఏళ్ల తరబడి యూనిఫామ్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు వయోపరిమితి పెంపు కీలకంగా మారింది. నియామక ప్రక్రియలో ఏర్పడిన జాప్యంతో వయసు కోల్పోయిన అభ్యర్థులకు ఇది పోటీ రంగంలోకి తిరిగి వచ్చే అవకాశాన్ని కల్పిస్తోంది. దీంతో రాబోయే యూనిఫామ్ సర్వీసుల నియామకాల్లో పోటీ మరింత పెరిగే అవకాశం ఉంది.

# ఉత్తమ అధికారులకు ప్రశంస పత్రాలు



కాకతీయ, గీసుగొండ: విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించిన ఉద్యోగులను 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులుగా ఎంపిక చేసి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. గీసుగొండ తహసీల్దార్ కార్యాలయ సర్వేయర్ కే. భాస్కర్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వెంకట కమలాకర్ శర్మ, వంచనగిరి, శాయంపేట గ్రామాల కార్యదర్శి జె. అనిల్, పోలీస్ కానిస్టేబుల్ జి. ప్రవీణ్ కుమార్‌లకు ఖిలా వరంగల్ కుష్ మహల్‌లో శనివారం నిర్వహించిన వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని అభినందించారు. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఇతరుల్లోనూ సేవా స్ఫూర్తి పెంపొందుతుందని పేర్కొన్నారు.

# ఆహార భద్రతకు ప్రజా ప్రభుత్వ పెద్దపీట




- ఆకలి లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు
- సన్న బియ్యంతో పేదలకు కడుపునిండా భోజనం
- పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో మంత్రి సీతక్క

కాకతీయ, ములుగు ప్రతినిధి : పేదల ఆకలి తీర్చడంతో పాటు అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రత కార్డు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. పేద కుటుంబాలు సైతం నాణ్యమైన సన్న బియ్యంతో రెండు పూటలా కడుపునిండా భోజనం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో నిర్వహించిన పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ రావుతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ నాణ్యమైన బియ్యం తినాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. సన్న బియ్యం ప్రయోజనం ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి అందాలంటే రేషన్ కార్డు కీలకమని పేర్కొన్నారు.

### అర్హులైన వారికి ప్రాధాన్యం

గతంలో రేషన్ కార్డుల కోసం ఎంతోమంది పేదలు ఎదురుచూశారని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజా ప్రభుత్వం అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి రేషన్ కార్డులు అందించే ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు లేని పేద కుటుంబాలను గుర్తించి వారికి ముందుగా కార్డులు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఆర్థికంగా స్థిరంగా ఉన్నవారి కంటే నిజమైన పేదలు, నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొనుగోలు శక్తి లేని కుటుంబాలకు ప్రభుత్వ సహాయం ముందుగా అందాలన్నారు. రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా ఆరోగ్యశ్రీతో పాటు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు ఉపయోగపడుతుందని మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రభుత్వ పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

### ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు

తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రేషన్ డీలర్లు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళలందరూ స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛన్లు అందించడంతో పాటు తలసేమియా బాధితులకు కూడా పింఛన్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

### పేదల జీవితాల్లో భరోసా

పేదల కష్టాలు, కన్నీళ్లు తుడిచి వారి జీవితాల్లో భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, సివిల్ సప్లై అధికారి షా ఫైజల్ హుస్సేని, డీఎం కృష్ణవేణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలి
- డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్
- నెల్లికుదురులో కాంగ్రెస్ నూతన కార్యాలయం ప్రారంభం



కాకతీయ, నెల్లికుదురు : నెల్లికుదురు మండల కేంద్రంలో కాంగ్రెస్ నూతన కార్యాలయాన్ని శనివారం డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ ప్రారంభించారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు ఎదల్ల యాదవ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తాను ఏనాడూ పదవులను ఆశించి పనిచేయలేదని నూతన మండల అధ్యక్షుడు ఎదల్ల యాదవ రెడ్డి అన్నారు. పదవి ఉన్నా లేకున్నా కార్యకర్తగా పార్టీ కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. ఎలాంటి గ్రూపులకు తావులేకుండా నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై నడవాలని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే పార్టీకి ఎదురుండదన్నారు. డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్, సమ్మె గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ హెచ్. వెంకటేశ్వర్లు, నాయకులు సత్యపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, ఆకుతోట సతీష్, వివిధ గ్రామాల సర్పంచులు,పార్టీ అధ్యక్షులు,మాజీప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన తహసీల్దార్

ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



కాకతీయ,ఆత్మకూరు : స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఆత్మకూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు స్వాతంత్ర సమరయోధులు త్యాగఫలమే నేటి 80 వ స్వాతంత్ర వేడుకలు అని స్వాతంత్ర కొరకు ఎందరో ప్రాణత్యాగాలు చేసారని తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.అనంతరం ఎంపీడీఓ కార్యాలయం లో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి జెండా ఆవిష్కరించి అందరికి 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పోలీస్ స్టేషన్ లో సిఐ సంతోష్ జెండా ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## వంగపహాడ్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



కాకతీయ, వరంగల్: గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పరిధిలోని వంగపహాడ్‌లో గడవంశీయ కులం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుల పెద్దమనిషి ముస్కు వీరేశం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ చిన్నారులు నిర్వహించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని కాపాడేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని పలువురు అన్నారు. కార్యక్రమంలో ముస్కు రాజమౌళి, ముస్కు వేణు, ముస్కు రాజేంద్రప్రసాద్, కోడెం నరేష్‌బాబు, కాళిదాసు శివ, రాము, వినయ్, గోపు శంకర్, నరసింహ, రంజిత్, రవి, ప్రేమ్, కృష్ణ, శేఖర్, రాజేష్, చిన్నారులు, స్థానికులు పాల్గొన్నారు.

## మురిసిన మువ్వన్నెల జెండా

- మండల వ్యాప్తంగా ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం
- ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

కాకతీయ, రాయపర్తి : వరంగల్ జిల్లా రాయపర్తి మండల వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పాక శ్రీనివాసులు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ముత్యం రాజేందర్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. గ్రామపంచాయతీల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు జెండాలు ఎగురవేశారు. రాజకీయ పార్టీల కార్యాలయాల్లో నాయకులు జెండా ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థుల దేశభక్తి గేయాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వరంగల్ డీఎంవో సురేఖ మృతి

- ఆమెతో పాటు సమీప బంధువు సైతం మృత్యువాత
- తాడ్వాయి-పస్రా మధ్య కారును ఢీకొట్టిన ఇసుక లారీ
- నుజ్జునుజ్జయిన కారు.. అక్కడికక్కడే ఇద్దరి మృతి
- ఎనిమిది నెలల క్రితం భర్తను.. రెండేళ్ల క్రితం కుమారుడిని కోల్పోయిన సురేఖ






కాకతీయ, ఏటూరునాగారం / వరంగల్ ప్రతినిధి : విధి నిర్వహణలో జాతీయ జెండా ఆవిష్కరించి.. బంధువుల ఇంట్లో శుభకార్యానికి బయలుదేరిన వరంగల్ జిల్లా మార్కెటింగ్ అధికారి (డీఎంవో) సురేఖకు మార్గమధ్యలోనే మృత్యువు ఎదురైంది. ములుగు జిల్లా తాడ్వాయి–పస్రా మధ్య ఎదురుగా వచ్చిన ఇసుక లారీ ఆమె ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టడంతో సురేఖతో పాటు సమీప బంధువు సురేష్ అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం జరిగిన ఈ ఘోర ప్రమాదంతో ఆమె కుటుంబం, బంధువులు, అధికార వర్గాల్లో విషాదం నింపింది. ఎనిమిది నెలల క్రితమే భర్తను.. రెండేళ్ల క్రితం కుమారుడిని కోల్పోయిన సురేఖ శనివారం ఆమె కూడా మృత్యువాత పడటంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా డీఎంవోగా పనిచేస్తున్న సురేఖ ప్రస్తుతం ఆత్మకూరు మార్కెట్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు ఆత్మకూరు మార్కెట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు తన వరుసకు బావ అయిన సురేష్‌తో కలిసి కారులో మణుగూరుకు బయలుదేరారు. కొద్దిసేపటికే తాడ్వాయి–పస్రా మధ్యలో కారు ప్రమాదానికి గురైంది.

### కారు నుజ్జునుజ్జు.. ఇద్దరూ అక్కడికక్కడే..

తాడ్వాయి–పస్రా మధ్యకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఇసుక లారీ కారును ఢీకొట్టింది. లారీ వేగంగా ఢీకొట్టడంతో కారు తీవ్రంగా దెబ్బతిని నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న సురేఖ, సురేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న ములుగు జిల్లా పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణాలు, లారీ డ్రైవర్ నిర్లక్ష్యం తదితర అంశాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. సురేఖ కుటుంబాన్ని వరుస విషాదాలు వెంటాడాయి. రెండేళ్ల క్రితం వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయారు. ఆ విషాదం నుంచి కుటుంబం కోలుకోకముందే.. ఎనిమిది నెలల క్రితం అనారోగ్యంతో భర్త మృతి చెందారు. ఇప్పుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేఖ కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఒకే కుటుంబంలో వరుసగా చోటుచేసుకున్న విషాదాలు బంధువులను కలచివేశాయి. సురేఖ మృతి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, సహోద్యోగులు ఘటనా స్థలానికి, ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆమెతో కలిసి పనిచేసిన అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో చురుకుగా ఉండే అధికారిణిని కోల్పోవడం మార్కెటింగ్ శాఖకు తీరని లోటని సహోద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

## స్వాంతంత్య్ర వేడుకలకు దూరంగా విద్యార్థులు

- సెయింట్ థెరిస్సా పాఠశాలపై తల్లిదండ్రుల ఆగ్రహం
- బస్సు ఫీజులు వసూలు చేసి రవాణా సౌకర్యం కల్పించలేదని ఆరోపణ
- వేడుకలకు విద్యార్థులను ఎందుకు తీసుకురాలేదని ప్రశ్న
- యాజమాన్యం వివరణ ఇవ్వాలని డిమాండ్
- ప్రిన్సిపాల్ స్పందించకపోవడంపై చర్చ






కాకతీయ, ఆత్మకూరు : దేశవ్యాప్తంగా 80వ స్వాంతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతుండగా.. ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా పాఠశాల విద్యార్థుల్లో పలువురు వేడుకలకు దూరంగా ఉండాల్సి వచ్చిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల బస్సులు గ్రామాలకు వెళ్లకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు రాలేకపోయారని పేర్కొన్నారు. బస్సు ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు జాతీయ పండుగ రోజున రవాణా సౌకర్యం ఎందుకు కల్పించలేదని ప్రశ్నిస్తున్నారు. స్వాంతంత్య్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు జాతీయ స్ఫూర్తి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా.. వారిని వేడుకలకు దూరంగా ఉంచడం సరికాదని తల్లిదండ్రులు అంటున్నారు. బస్సులు నడపకపోవడానికి కారణాలను యాజమాన్యం స్పష్టం చేయాలని కోరుతున్నారు.

### ఫీజులు వసూలు చేశారు... బస్సులు ఎందుకోసం..!

విద్యార్థుల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన పాఠశాల బస్సులు గ్రామాలకు వెళ్లకపోవడంపై తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బస్సు ఫీజులు తీసుకుంటున్నప్పుడు రవాణా సౌకర్యం కూడా సక్రమంగా అందించాలని కోరుతున్నారు. బస్సులు నడపకపోవడం వల్ల ఇంధన ఖర్చు తగ్గించుకోవాలనే ఉద్దేశమా అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను స్వాంతంత్య్ర వేడుకలకు ఎందుకు దూరంగా ఉంచారు, గ్రామాలకు బస్సులు ఎందుకు వెళ్లలేదు అనే అంశాలపై పాఠశాల యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా స్పందించలేదని తెలిపారు. ఫీజుల వసూళ్లతో పాటు విద్యార్థుల రవాణా, జాతీయ పండుగల్లో వారి భాగస్వామ్యంపై కూడా పాఠశాల యాజమాన్యం శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చదువుపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం



- ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సహకారం
- మౌలిక వసతుల కల్పనకు చేయూత
- చేయూత మిత్రబృందం నిర్వాహకులు పొదిల రాజేష్, బైరి రమణారెడ్డి
- విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్ల పంపిణీ

కాకతీయ, భూపాలపల్లి : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేయూత మిత్రబృందం ఆధ్వర్యంలో చిన్నకోడెపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పాఠశాల బ్యాగులు, వాటర్ బాటిళ్లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు చాడ అనితారెడ్డి సమక్షంలో సుమారు 80 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని చేయూత మిత్రబృందం నిర్వాహకులు పొదిల రాజేష్, బైరి రమణారెడ్డి తెలిపారు. పాఠశాలల్లో సమస్యలు, మౌలిక వసతుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

### చదువుపై ఆసక్తి పెంచేందుకు

విద్యార్థులకు ఉపయోగపడే సామగ్రిని అందించడం ద్వారా వారిలో చదువుపై మరింత ఆసక్తి పెంపొందించడమే తమ ఉద్దేశమన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చేయూత మిత్రబృందం నిర్వాహకులు పొదిల రాజేష్, బైరి రమణారెడ్డి ,చేయూత మిత్రబృందం సభ్యులు మాటేటి సురేష్, మాటేటి త్రివిన్, దొరి హరికృష్ణ, కట్ల రాజు రెడ్డి, గుండు సందీప్, దొరి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ సాధు సుమలత ధర్మేందర్, ఉపాధ్యాయులు రాములు, రమేష్, మార్త రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ ఏం తమాషాగా ఉందా!





- ఆగస్టు 15 గడువు దాటినా మారెళ్లపాడు పనులు పూర్తి కాలేదెందుకు?
- అధికారులు పనిచేస్తున్నారా.. ఆడుకుంటున్నారా?
- లిఫ్ట్ పనులకు అడ్డంకుల్లేకున్నా జాప్యంపై మంత్రి తుమ్మల ఆగ్రహం
- నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలంటూ అల్టిమేటం
- రైతుల జీవితాలతో ఆటలాడొద్దని హెచ్చరిక

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి : ఆగస్టు 15లోగా రైతులకు సాగునీరు అందించాల్సిన మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు గడువు దాటినా పూర్తికాకపోవడంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూసేకరణ సమస్య లేదు.. నిధుల కొరత లేదు.. పనులకు ఎలాంటి అడ్డంకులూ లేవు.. అయినా పనులు ఎందుకు పూర్తికాలేదంటూ అధికారులను, గుత్తేదారులను నిలదీశారు. "కాంట్రాక్టర్ ఏం తమాషాగా ఉందా? గడువు దాటినా పనులు ఎందుకు పూర్తి కాలేదు?" అంటూ తీవ్రంగా మండిపడ్డారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారా.. లేక పనులను గాలికొదిలేశారా అని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పనులను వేగవంతం చేసి సాగునీరు అందించాలని ఆదేశించారు. అశ్వాపురం మండలం మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి అధికారులతో సమీక్షించారు. గతంలోనే ఆగస్టు 15లోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని గడువు విధించినా.. ఆ గడువు ముగిసే నాటికి పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులకు భూసేకరణ, నిధుల సమస్యలు లేనప్పుడు ఇక జాప్యానికి కారణమేంటని ప్రశ్నించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌ను అధికారులు ఎందుకు ఒత్తిడి చేయలేదని నిలదీశారు. రైతులకు ఉపయోగపడాల్సిన ప్రాజెక్టు పనుల్లో కాలయాపన చేస్తే సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం అవసరమైన నిధులు సమకూరుస్తున్నప్పటికీ పనులు నత్తనడకన సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల జీవితాలతో ఆటలాడొద్దని.. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### నెలాఖరులోగా పూర్తి చేయాల్సిందే

మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు, గుత్తేదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేసి మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులకు ఎవరైనా కావాలని అడ్డుపడితే పోలీసుల సహకారంతోనైనా పనులు కొనసాగించాలని ఆదేశించారు. పనుల్లో రాజకీయ జోక్యం ఉంటే తగిన విధంగా స్పందిస్తామని మంత్రి హెచ్చరించారు. రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టును ఇకనైనా ఆలస్యం చేయకుండా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తానని స్పష్టం చేశారు. నెలాఖరులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేయాలని మంత్రి తేల్చిచెప్పారు.

## త్యాగాల స్వాతంత్ర్యాన్ని కాపాడుకుందాం

- దేశాన్ని తాకట్టు పెడుతున్న బీజేపీ
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు

కాకతీయ, కారేపల్లి : మహనీయుల త్యాగాల ఫలంగా సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర అన్నారు. కారేపల్లిలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జెండాను కొండబోయిన నాగేశ్వరరావు ఆవిష్కరించారు. బీజేపీ దేశాన్ని విదేశీ పెట్టుబడులకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. అమరవీరులు సాధించిన హక్కులు, చట్టాలను కాలరాస్తోందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తలారి దేవ ప్రకాష్, ముక్క సీతారాములు, కరకపల్లి రాయమల్లు, అరెల్లి శ్రీరాములు, తొగర బాబు, మేకల తిరుపతి, శ్రీను, కోటయ్య, సాంబయ్య, సంపత్, సైదులు, శంకర్ పాల్గొన్నారు.

## అనాథలకు అన్నప్రసాదాల వితరణ



కాకతీయ, ఖమ్మం టౌన్: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనిటీ ఇన్ డైవర్సిటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రమంలో వందలాది మంది అనాథలకు శనివారం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆర్థోపెడిక్ అండ్ స్పైనల్ కార్డ్ సర్జన్ డాక్టర్ వజీరుద్దీన్ సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. అనాథలకు భోజనం అందించి వారితో కలిసి స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కత్తి నెహ్రూ గౌడ్, షేక్ జాఫర్ తెలిపారు. సేవాభావం, మానవత్వం, ఐక్యతను పెంపొందించడమే సంస్థ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఇ.డి.ఐ. జయరాజ్, అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సభ్యులు గుండ్లపల్లి శేషగిరిరావు, హబీబ్, షేక్. మహబూబ్ బక్షి, అన్నం సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## తీజ్ పండగ నిర్వహణపై విచారణ జరపాలి

### ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కాకతీయ, గుండాల: గుండాల ఎకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)లో తీజ్ పండగ నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. ఆగస్టు 15న నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సనప విష్ణు మాట్లాడారు. కార్యక్రమానికి ఉన్నతాధికారుల అనుమతులు, ఆదేశాలు ఉన్నాయో స్పష్టం చేయాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహించి ఉంటే బాధ్యులైన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తు, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్పందించకపోతే తల్లిదండ్రులతో కలిసి ఈఎంఆర్ఎస్ ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి కల్తీలక్ష్మణ్,నాగరాజు,బుచ్చయ్య,లిపిన్ పాల్గొన్నారు.

## డ్రగ్స్‌పై అవగాహనకు వ్యాసరచన పోటీ..

### విజేతలకు బహుమతులు



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: మణుగూరు అబ్కారీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అబ్కారీ సీఐ రాజీరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు 'డ్రగ్స్ మరియు యువత–సమాజంపై వాటి ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అబ్కారీ శాఖ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## వెంపటి వాసికి సేవా పథకం

కాకతీయ, తుంగతుర్తి: తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన గుండగాని మహేందర్ (హెచ్‌సీ 953)కు పోలీస్ శాఖలో సేవా పథకం లభించింది. ఇంటెలిజెన్స్ విభాగం నుంచి సీఎం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహేందర్ సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఐజీపీ శ్రీ గజపతిరావు భూపాల్, ఐపీఎస్, ఎస్పీ శ్రీ ఏ. రాజేష్ చేతుల మీదుగా మహేందర్ సేవా పథకాన్ని అందుకున్నారు. తన సేవలను గుర్తించి గౌరవం అందించిన ఐజీపీ, ఎస్పీలకు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

### స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను

## స్ఫూర్తిగా తీసుకోవాలి

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్

కాకతీయ, ఖమ్మం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్ కోరారు. ఖమ్మం నగరంలోని 24వ డివిజన్ పాకబండ బజార్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చట్టాలను గౌరవించడం, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు.

### సమరయోధుల

## త్యాగాలను స్మరించుకోవాలి

### బీఆర్ ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

### తెలంగాణ భవన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



కాకతీయ, ఖమ్మం : ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశం కోసం స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణాలను సైతం త్యాగం చేయడం వల్లే నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని తాతా మధుసూదన్ అన్నారు. వారి త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయడంతో పాటు దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించి రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితోనే తెలంగాణ హక్కుల కోసం ఉద్యమం సాగిందన్నారు. దేశం, తెలంగాణ, ఖమ్మం జిల్లా శాంతిసుభిక్షాలతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పగడాల నరేందర్ చేత పార్టీ జెండాను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులకే ఉచిత సంక్షేమ ఫలాలు



**అర్హులను వదలొద్దు.. అనర్హులకు ఉచితాలు ఇవ్వొద్దు**

**అర్హత లేనివారు రేషన్ కార్డులు తిరిగి ఇవ్వాలి**

**పేదల అభ్యున్నతికి విద్యే ప్రధాన మార్గం**

**రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి : అర్హులైన పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అర్హులను వదలొద్దని, అనర్హులకు సంక్షేమ ప్రయోజనాలు అందించొద్దని సూచించారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పేదవాడు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇస్తోందని తుమ్మల అన్నారు. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందిస్తూ కుటుంబంలోని ప్రతి సభ్యుడికి నెలకు ఆరు కిలోల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నామని తెలిపారు. అర్హత లేని వారు తమ రేషన్ కార్డులను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి తిరిగి అందించాలని కోరారు. అనర్హులు కార్డులు ఉంచుకోవడం వల్ల నిజమైన పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు.

### విద్యతోనే పేదరిక నిర్మూలన

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూనే పిల్లల విద్యకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు శాశ్వతంగా అభివృద్ధి చెందేందుకు విద్యే ప్రధాన మార్గమన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏకలవ్య, కస్తూర్బా, గురుకుల పాఠశాలల ద్వారా పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తుమ్మల తెలిపారు. ఐదు నియోజకవర్గాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజల కోసం చేసిన పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మేయర్ గణేష్, పసుపులేటి వీరబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుతో.. సంక్షేమ భరోసా!

**ఖమ్మం జిల్లాలో 62 వేల కొత్త కార్డులు**

**సుమారు 2 లక్షల మందికి ప్రయోజనం**

**రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు ఉచిత సన్నబియ్యం**

**ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు**

**పేదల జీవన ప్రమాణాలే ప్రభుత్వ లక్ష్యం: భట్టి విక్రమార్క**



కాకతీయ, ఖమ్మం బ్యూరో : స్మార్ట్ రేషన్ కార్డులు పేద కుటుంబాలకు కేవలం బియ్యం పొందే గుర్తింపు కార్డులు కావని.. ఆరోగ్యంతో పాటు విద్య, ఇల్లు, ఉచిత విద్యుత్, గ్యాస్ తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలకు కీలక ఆధారంగా నిలుస్తాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా.. 1,06,28,092 కుటుంబాలకు రేషన్ కార్డులు అందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. 3.42 కోట్లకు పైగా లబ్ధిదారులకు నెలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.55 వరకు ఉన్నప్పటికీ.. పూర్తి వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. పేద కుటుంబాల్లో ఆహార భద్రత కల్పించడంతో పాటు వారి నెలవారీ ఖర్చు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ.. ఉచిత విద్యుత్

రేషన్ కార్డు పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ముఖ్యమైన ఆధారమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, కొత్తగా రేషన్ కార్డు పొందిన కుటుంబాలు కూడా ఆరోగ్యశ్రీ ప్రయోజనం పొందవచ్చని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ప్రయోజనాలు కూడా అర్హులైన కుటుంబాలకు అందుతాయని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటివరకు ఆర్టీసీకి ప్రభుత్వం రూ.10,700 కోట్లు చెల్లించిందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. గురుకుల విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని వివరించారు. విద్యా రంగంలోనూ ప్రభుత్వం పెద్దఎత్తున మార్పులు తీసుకొస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలకు ఇందిరమ్మ చీరలు, పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు.

### ఖమ్మంలో 62 వేల కొత్త కార్డులు

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 62 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సుమారు 2 లక్షల మందికి ప్రయోజనం కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 4,72,267 రేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. సన్నబియ్యం పంపిణీ విజయవంతంగా కొనసాగుతోందని.. దీని ద్వారా ప్రస్తుతం ఒక్కో కుటుంబానికి నెలకు సుమారు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ఆదా అవుతోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులతో బియ్యం పంపిణీ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్నారా?


**స్టే ఉన్నా చార్వాక ఆశ్రమ భూమిలో సబ్‌స్టేషన్ పనులు!**
**అధికారులకు వాట్సాప్‌లో ఆదేశాల ప్రతులు**
**న్యాయస్థానం ఉత్తర్వులే పట్టించుకోరా?**
**పనులు కొనసాగడంపై ఆశ్రమ నిర్వాహకుల అభ్యంతరం**
**ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్**



కాకతీయ, చందుర్తి : హైకోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నాయా? వాటిని అధికారులు పాటిస్తున్నారా? అన్న ప్రశ్నలు రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటలో తలెత్తుతున్నాయి. చార్వాక వృద్ధుల ఆశ్రమానికి సంబంధించిన భూమిలో ఎన్‌పీడీసీఎల్ అధికారులు సబ్‌స్టేషన్ పనులు చేపట్టడంపై వివాదం నెలకొంది. ఈ భూమికి సంబంధించి హైకోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ పనులు కొనసాగుతున్నాయని ఆశ్రమ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. న్యాయస్థానం ఆదేశాల ప్రతులను సంబంధిత అధికారులతో పాటు స్థానిక తహసీల్దార్‌కు వాట్సాప్ ద్వారా పంపించినా పనులు నిలిపివేయలేదని వారు పేర్కొంటున్నారు. భూమికి సంబంధించిన వివాదంపై హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో స్టే ఉత్తర్వులు ఉన్నాయని ఆశ్రమ నిర్వాహకులు చెబుతున్నారు. న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు ఉన్నప్పుడు వాటి పరిధిలోని భూమిలో నిర్మాణ పనులు చేపట్టడానికి అనుమతి ఉందా? ఉంటే ఏ ఉత్తర్వుల ఆధారంగా పనులు కొనసాగిస్తున్నారు? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. స్టే విషయం అధికారుల దృష్టికి వచ్చిన తర్వాత కూడా పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే.. అందుకు బాధ్యత ఎవరిది? అని ఆశ్రమ నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయాల్సిన అధికారులే వాటిని పట్టించుకోలేదన్న భావన ఏర్పడితే వ్యవహారం మరింత తీవ్రత సంతరించుకునే అవకాశం ఉంది. అందుకే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల పూర్తి వివరాలు, వాటి పరిధి, సంబంధిత భూమిపై వాటి ప్రభావాన్ని అధికారులు స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### వాట్సాప్‌లో ఆదేశాలు చేరినా..?

హైకోర్టు ఉత్తర్వుల ప్రతులను ఎన్‌పీడీసీఎల్ సంబంధిత అధికారులకు, స్థానిక తహసీల్దార్‌కు వాట్సాప్ ద్వారా పంపించినట్లు చార్వాక వృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు చెబుతున్నారు. ఉత్తర్వుల సమాచారం అధికారులకు చేరిందా? చేరితే ఎప్పుడు చేరింది? ఆ తర్వాత పనులను ఎందుకు నిలిపివేయలేదు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు సబ్‌స్టేషన్ పనులు ప్రజా అవసరాలకు సంబంధించినవే అయినప్పటికీ.. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్న భూమి విషయంలో న్యాయపరమైన అంశాలను పక్కనపెట్టి పనులు చేపట్టడం సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్టే ఉత్తర్వుల అమలు స్థితిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. భూమి హక్కులు, సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, హైకోర్టు ఉత్తర్వుల పరిధి వంటి అంశాలను పరిశీలించి వాస్తవాలను తేల్చాలని ఆశ్రమ నిర్వాహకులు కోరుతున్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నాయా? ఉంటే వాటిని ఉల్లంఘించేలా పనులు జరుగుతున్నాయా? అన్నదానిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేస్తు న్నారు. హైకోర్టు ఉత్తర్వుల కాపీ అధికారులకు అందినట్లు నిర్ధారణ అయితే .. పనుల కొనసాగింపుపై తీసుకున్న నిర్ణయం ఏమిటో కూడా అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. న్యాయస్థానం ఆదేశాలను గౌరవిస్తూ, వివాదం పరిష్కారమయ్యే వరకు చట్టపరమైన ప్రక్రియకు అనుగుణంగా వ్యవహరించాలని ఆశ్రమ నిర్వాహకులు కోరుతున్నారు.




## అజార హాస్పిటల్‌లో తలకిందులుగా జాతీయ జెండా



కాకతీయ, హనుమకొండ: హనుమకొండ నగరంలోని ములుగు రోడ్డు ప్రాంతంలో ఉన్న అజార హాస్పిటల్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. హాస్పిటల్ యజమాని, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శివ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగినట్లు సమాచారం. జాతీయ జెండాను గౌరవప్రదంగా ఎగురవేయాల్సి ఉండగా, తలకిందులుగా ఉన్న విషయాన్ని గుర్తించకుండానే కార్యక్రమం నిర్వహించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జెండా విషయంలో నిబంధనలు, గౌరవ మర్యాదలు పాటించాలని పేర్కొన్నారు. ఘటనపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు. జెండా తలకిందులుగా ఎగురవేయడం ఉద్దేశపూర్వకమా, పొరపాటా అనేది తేలాల్సి ఉంది.

## కోతుల దాడిలో గాయపడిన రైతు మృతి

**వ్యవసాయ పనులకు వెళ్లి వస్తుండగా దాడి**
**రెండు రోజుల చికిత్స అనంతరం విషాదం**



కాకతీయ, నల్లబెల్లి : కోతుల దాడిలో తీవ్రంగా గాయపడిన రైతు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామ గ్రామంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వర్ణే యాదగిరి, 51, వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా కోతుల గుంపు దాడి చేసింది. ఈ ఘటనలో ఆయన కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ములుగు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ములుగు జిల్లా ఆసుపత్రిలో రెండు రోజుల పాటు చికిత్స పొందిన అనంతరం యాదగిరి పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. యాదగిరి మృతితో నందిగామ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పెద్ది విగ్రహం ఏర్పాటు.. పలువురిపై కేసులు

**అనుమతులు లేకుండా విగ్రహం ఆవిష్కరణ**
**పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు**
**శీలం వీరన్న, నన్నపనేని నరేందర్, దుష్యంత్‌రెడ్డి తదితరులపై కేసు**

కాకతీయ, నర్సంపేట : అనుమతులు లేకుండా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించిన ఘటనపై పలువురిపై నర్సంపేట పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ నెల 10న పట్టణంలో గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సమాచారం. నర్సంపేట మెడికల్ కళాశాల ఎదురుగా పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు టీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించాయి. అంతకుముందు రోజు మున్సిపల్ సిబ్బంది విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దెను తొలగించారు. మరుసటి రోజు తిరిగి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించినట్లు తెలిసింది. గస్తీలో ఉన్న కానిస్టేబుల్ అనుమతి పత్రాలు చూపించాలని కోరగా, అవి లేకపోవడంతో ఎస్సై జి. అరుణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేయడంపై ఎస్సై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో శీలం వీరన్న తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినట్లు సమాచారం. పోలీసులు అడ్డుకున్న అనంతరం ఎస్సైతో అనుచితంగా ప్రవర్తించడంతో పాటు సుమారు నాలుగు గంటలపాటు విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి శీలం వీరన్న, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, దుష్యంత్‌రెడ్డి, సంగని సూరయ్య, దోనాల రవి తదితరులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే పరకాల అభివృద్ధి

**అప్పటి పనులకు కాంగ్రెస్ రంగులు**
**కొత్తగా ఒక్క అభివృద్ధి పనైనా చూపించాలి**
**100 పడకల ఆసుపత్రిని ఎందుకు అందుబాటులోకి తేలేదు**
**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



కాకతీయ, పరకాల : బీఆర్ఎస్ హయాంలోనే పరకాల నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. అప్పట్లో మంజూరై పూర్తయిన పనులకు కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి రంగులు వేసి, కొత్తగా చేపట్టిన పనులుగా ప్రచారం చేసుకుంటూ ప్రారంభోత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సహకారంతో పరకాల ప్రజల ఆకాంక్ష మేరకు మంజూరై పూర్తయిన 100 పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల తదితర అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమన్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో పరకాల పట్టణానికి కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. పూర్తయిన 100 పడకల ఆసుపత్రిని ఇంతకాలం ప్రజలకు ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేకపోయారో ఎమ్మెల్యే ఆత్మవిమర్శ చేసుకోవాలని ధర్మారెడ్డి అన్నారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, సిబ్బంది ఇప్పటికీ అందుబాటులో లేరని తెలిపారు. సిబ్బంది నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులకు రంగులు వేసుకోవడం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఒక్క కొత్త అభివృద్ధి పనినైనా ప్రజలకు చూపించాలని చల్లా ధర్మారెడ్డి సవాల్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా పనిచేయాలి

- స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయాలి
- పరిశుభ్రమైన, సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు
- బల్దియా ప్రత్యేక అధికారి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని బల్దియా ప్రత్యేక అధికారి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కమిషనర్ టి. వెంకన్నతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలను గుర్తుంచుకోవాలని కలెక్టర్ అన్నారు. పరిశుభ్రమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ప్రజల భాగస్వామ్యంతో జీడబ్ల్యూఎంసీని మరింత అభివృద్ధి పథంలోకితీసుకెళ్లేందుకుఅధికారులుకృషిచేస్తున్నారని తెలిపారు.

### ఉత్తమ సేవలకు ప్రశంసలు

ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్, కమిషనర్ సంయుక్తంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. హనుమకొండ జిల్లా తరఫున అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, డిప్యూటీ ఇంజనీర్ రోజారాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వరంగల్ జిల్లా తరఫున శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీనివాస్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికై మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రశంసాపత్రం స్వీకరించారు. వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్ రాజారెడ్డి, ఎంజీఎంలో సూపరింటెండెంట్ రామ్‌కుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్, లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో మార్కెట్ చైర్‌పర్సన్ యెర్ర ప్రియాంక, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల కార్యాలయంలో సంఘం కార్యదర్శి రాజేందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## హైస్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**ఆకట్టుకున్న మార్చ్‌ఫాస్ట్, పిరమిడ్స్, కరాటే విన్యాసాలు**
**దేశభక్తి గేయాలు, నృత్య ప్రదర్శనలతో సందడి**
**800 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ**




కాకతీయ, హనుమకొండ : విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించేలా దామెర మండలం ఒగులాపూర్‌లోని డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు దయ్యాల సదయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పతాకావిష్కరణకు ముందు సుమారు 800 మంది విద్యార్థినీ, విద్యార్థులు దామెర క్రాస్‌రోడ్ నుంచి పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో సాగిన ర్యాలీ అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన క్రమబద్ధమైన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. పిరమిడ్స్, కరాటే విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు చేసిన దేశభక్తి ప్రసంగాలు, గేయాలు, నృత్య ప్రదర్శనలు ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పాయి. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు అభినందించారు. గ్రామ సర్పంచ్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ముఖ్య అతిథి, రిటైర్డ్ ఎంఈఓ బాలుగు గట్టయ్య స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. దయ్యాల మల్లయ్య, బాలుగు లక్ష్మీనివాసం, కరస్పాండెంట్ బి. శోభారాణి, డైరెక్టర్లు డి. రాకేష్ భాను, దినేష్ చందర్, డాక్టర్ బి. పవన్, డి. భానుచందర్, కావ్య శ్రీ, మీన, యాంసాని శ్రీనివాస్, కే. వెంకట్, ఇంద్రారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రైతు, మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం
- వరంగల్ అభివృద్ధికి వేల కోట్ల నిధులు
- ఆరు గ్యారంటీలతో ప్రజలకు అండ
- పచ్చదనం, శాంతిభద్రతలకు పెద్దపీట
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : రైతు సంక్షేమానికే తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రైతు, మహిళా సంక్షేమంతో పాటు అభివృద్ధిని లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. రైతు భరోసా కింద జిల్లాలో 1,58,201 మంది రైతులకు రూ.162.03 కోట్లు అందించినట్లు మంత్రి తెలిపారు. రైతు బీమా కింద 242 రైతు కుటుంబాలకు రూ.12.10 కోట్లు అందించామన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వరికి బదులు మొక్కజొన్న, పెసర వంటి ఆరుతడి పంటలను 44,745 ఎకరాల్లో సాగు చేస్తున్నారని, పంట మార్పిడిని రైతులు ఆదరించాలని సూచించారు.

### ఆరు గ్యారంటీలతో సంక్షేమం

మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 7.5 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసి రూ.311.88 కోట్ల ప్రయోజనం పొందారని తెలిపారు. గృహజ్యోతి కింద 1,40,862 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 9,522 ఇళ్లు మంజూరు కాగా, 2,973 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళా సంఘాలకు రూ.60 కోట్లకు పైగా రుణాలు ఇప్పించినట్లు తెలిపారు. వరంగల్ హెల్త్ సిటీలో రూ.1,371 కోట్లతో చేపట్టిన 2,100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం 90 శాతం పూర్తయిందన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పీఎం మిత్ర పార్క్‌గా ప్రారంభమై యువతకు ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డుకు రూ.319 కోట్లు, ఆధునిక బస్‌స్టేషన్‌కు రూ.125 కోట్లు కేటాయించామని, వరంగల్ విమానాశ్రయ విస్తరణకు భూసేకరణ పూర్తయిందన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో 11.5 లక్షల మొక్కలు నాటినట్లు మంత్రి తెలిపారు. పాకాల పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ప్రజలు సహకరించాలని కోరారు. తెలంగాణను అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## చిన్న వర్షానికే బస్‌స్టేషన్ బురదమయం!

**వందలాది ప్రయాణికుల అవస్థలు..**
**ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం!**
**ఏళ్లుగా ఇదే దుస్థితి..**
**శాశ్వత పరిష్కారం ఎప్పుడు?**



కాకతీయ,శంకరపట్నం:కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని ప్రయాణ ప్రాంగణం (బస్‌స్టేషన్) సమస్యలకు నిలయంగా మారింది. చిన్నపాటి వర్షం పడితే చాలు ప్రాంగణం మొత్తం బురదమయంగా మారడంతో రోజూ వందలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు బురదలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రాంగణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్డు తదితర మౌలిక వసతులు లేకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి బురదగా మారుతోంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు బురదలో నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు రాకపోకలు సాగించే సమయంలో బురద చిమ్మడంతో ప్రయాణికుల అవస్థలు మరింత పెరుగుతున్నాయి. రోజూ వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ ప్రాంగణంలో కనీస సౌకర్యాలు లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు. వందలాది మంది ప్రయాణికులు వినియోగించే ప్రాంగణం పట్ల అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆస్పత్రుల్లో వైద్యం అంతంతే

- హన్మకొండలో గాడి తప్పిన వైద్య సేవలు
- హసన్‌పర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో మృగ్యమైన సేవలు
- కమలాపూర్, ధర్మసాగర్‌లో అప్పుడప్పుడే వైద్యులు
- పీహెచ్‌సీల్లో పరిస్థితి మరీ దారుణం
- వేధిస్తున్న వైద్యుల కొరత.. ఉన్నవారి హాజరు కూడా నామమాత్రమే
- హాజరు కోసం వచ్చి వెళ్తున్నారనే విమర్శలు



కాకతీయ, హన్మకొండ : హన్మకొండ జిల్లాలో ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మృగ్యమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యుల కొరత ఓవైపు.. ఉన్న వైద్యులు కూడా విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం మరోవైపు సమస్యగా మారింది. హాజరు కోసం ఆస్పత్రికి వచ్చి కొద్ది సేపటికే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే పరిస్థితి ఇలా తయారైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హసన్‌పర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు ఆశించిన స్థాయిలో అందడం లేదన్న ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సిన స్థాయిలో లేకపోవడం, రోగులకు అవసరమైన సమయంలో వైద్యం అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఇటీవల పలు మీడియాల్లో కథనాలు వచ్చినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. వార్తలు వచ్చినప్పుడే అధికారులు స్పందించి ఆ తర్వాత మళ్లీ పట్టించుకోకపోవడంతో సమస్య యథాతథంగా కొనసాగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## వంద పడకల ఆస్పత్రిలో వైద్యం ఏదీ?

హసన్‌పర్తి ప్రభుత్వ ఆస్పత్రి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉంది. నిత్యం పెద్ద సంఖ్యలో రోగులు వైద్యం కోసం వస్తుంటారు. అయితే వైద్యులు అందుబాటులో లేకపోవడం, కొన్ని విభాగాల్లో సేవలు సక్రమంగా అందకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రోగుల బంధువులు వాపోతున్నారు. ఇటీవల ఈ ఆస్పత్రి పనితీరుపై పలు కథనాలు వచ్చినా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించకపోవడం చర్చనీయాంశంగా మారింది. వైద్యుల హాజరు, రోగులకు అందుతున్న సేవలు, ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలన జరిపితే అసలు పరిస్థితి బయటపడుతుందని స్థానికులు అంటున్నారు.

## కమలాపూర్, ధర్మసాగర్‌లో ఇదే తీరు

కమలాపూర్, ధర్మసాగర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ వైద్యుల రాక క్రమం తప్పుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. వైద్యులు ప్రతిరోజూ అందుబాటులో ఉండాల్సి ఉన్నా అప్పుడప్పుడే దర్శనమిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులకు కూడా సరైన సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు. వైద్యుల కొరత కారణంగా ఉన్న వైద్యులపై అదనపు భారం పడుతుండగా, అందుబాటులో ఉన్న సిబ్బంది పనితీరును కూడా ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## పీహెచ్‌సీల్లో మరింత దారుణం

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. వైద్యుల కొరత కారణంగా పలు పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదని తెలుస్తోంది. ఉన్న వైద్యులు కూడా నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా లేదా అన్న దానిపై పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు ఉన్నాయి. వైద్యుల కోసం పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు నిరీక్షణ తప్పడం లేదని, కొన్నిసార్లు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇతర ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలే ప్రధాన ఆధారం కావడంతో ఈ పరిస్థితి పేదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

## హాజరు కోసం వచ్చి వెళ్తున్నారా?

జిల్లాలోని కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల హాజరుపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాజరు నమోదు చేసుకునేందుకు ఆస్పత్రికి వచ్చి కొద్దిసేపటికే వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. విధుల సమయమంతా ఆస్పత్రిలో ఉండి రోగులకు వైద్య సేవలు అందించాల్సిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఈ ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. బయోమెట్రిక్ హాజరు వివరాలు, విధుల పట్టికలు, సెలవుల వివరాలు పరిశీలించడంతో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వస్తుందని ప్రజలు కోరుతున్నారు. వైద్యుల కొరతపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది పనితీరుపైనా కఠిన పర్యవేక్షణ ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ఆస్పత్రుల్లో వైద్యులు సక్రమంగా హాజరవుతున్నారా, రోగులకు నిర్ణీత సమయాల్లో సేవలు అందుతున్నాయా, పీహెచ్‌సీల్లో పరిస్థితి ఎలా ఉందన్న అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే నెలల తరబడి సమస్యలు కొనసాగుతున్నా క్షేత్రస్థాయిలో పెద్దగా మార్పు కనిపించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విధులకు డుమ్మా కొట్టే వైద్యులతో ఎవరి మిలాఖత్ ఉందన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. బాధ్యతాయుతమైన అధికారులు ఉన్నప్పటికీ కింది స్థాయిలో ఇలాంటి పరిస్థితులు కొనసాగుతున్నాయంటే పర్యవేక్షణ వ్యవస్థ ఎంతమేర పనిచేస్తుందో స్పష్టమవుతోంది. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వైద్యుల హాజరును పర్యవేక్షిస్తేనే ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు మళ్లీ నమ్మకం కలిగే అవకాశం ఉంది.

# ఫామ్-6 ఎందుకు? నేను వేయను..

**ఓటు తొలగింపుపై ప్రకాశ్‌రాజ్ ఫైర్!**

**'పర్మినెంట్లీ షిఫ్టెడ్' అంటూ ఓటు తొలగించారు**

**ప్రశ్నించగానే పొరపాటు జరిగిందని అంగీకరించారన్న నటుడు**

**ఫామ్-8 తీసుకోవడానికి నిరాకరించారంటూ ఆరోపణ**

**స్పందించకపోతే దేశవ్యాప్త ఆందోళనకు హెచ్చరిక**

బెంగళూరు : కర్ణాటకలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తన ఓటును తొలగించడంపై నటుడు ప్రకాశ్‌రాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఓటర్ ఐడీని తొలుత 'పర్మినెంట్లీ షిఫ్టెడ్'గా చూపించి తొలగించారని, దీనిపై ప్రశ్నించడంతో అధికారులు తప్పు జరిగిందని అంగీకరించారని ఆయన తెలిపారు. ఆ తర్వాత రాత్రికి రాత్రే వెబ్‌సైట్‌లో తన స్టేటస్‌ను 'షిఫ్టెడ్'గా మార్చి మరో వివరణ ఇస్తున్నారని విమర్శించారు. బెంగళూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు పారదర్శకంగా లేదని ఆరోపించారు. తొలగించిన ఓటును తిరిగి నమోదు చేసుకునేందుకు ఫామ్–6 సమర్పించాలని ఎన్నికల అధికారులు సూచించడంపై ప్రకాశ్‌రాజ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "నేను ఫామ్–6పై సంతకం చేస్తే నా ఓటును మీరు తొలగించినట్లు నేనే అంగీకరించినట్లవుతుంది. అందుకే ఫామ్–6 వేయను" అని స్పష్టం చేశారు. ఓటర్ల వివరాల్లో మార్పులు, సవరణల కోసం తాను ఫామ్–8 సమర్పించేందుకు ప్రయత్నించినా అధికారులు స్వీకరించలేదని ఆయన చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.

## 'సామాన్యుల పరిస్థితి ఏంటి?'

తనలాంటి ప్రముఖుడి ఓటు విషయంలోనే ఇలా వ్యవహరిస్తే.. సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటని ప్రకాశ్‌రాజ్ ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల పేర్లు తొలగించి.. మళ్లీ నమోదు కోసం దరఖాస్తులు చేయించేందుకు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లకోసారి ఓట్ల కోసం ప్రజల ముందుకు వచ్చే పాలకులు.. ఇప్పుడు అదే ప్రజలను తమ ఓటు హక్కు కోసం కార్యాలయాల చుట్టూ తిప్పడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు. తన ఓటు విషయంలో అధికారులు ఒకటి రెండు రోజుల్లో సరైన వివరణ ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ప్రజలను సమాయత్తం చేసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. "రెండేళ్లు పోరాడాల్సి వచ్చినా నా ఓటు హక్కును తిరిగి పొందుతా" అని ప్రకాశ్‌రాజ్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో తన ప్రభావంతో కనీసం పది ఓట్లను అయినా ప్రభావితం చేయగలనని వ్యాఖ్యానిస్తూ.. బీజేపీని ఓడించడమే తన లక్ష్యమని ప్రకటించారు.

# ఇంటి నుంచే గ్యాస్ ఈ–కేవైసీ!

**ఫోన్‌లోనే చేసుకునే అవకాశం**

**ఏజెన్సీకి వెళ్లాల్సిన అవసరం లేదు**

**ఆధార్, రిజిస్టర్డ్ మొబైల్ ఉంటే చాలు**

**యాప్‌లో అథెంటికేషన్ పూర్తి చేస్తే సరి**

**డెలివరీ సిబ్బంది ద్వారా కూడా అవకాశం**

**పూర్తయిందో లేదో ముందే చూసుకోండి**

కాకతీయ,స్పెషల్ డెస్క్ : ఇంటి నుంచే గ్యాస్ కనెక్షన్ ఈ–కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం ఉంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, గ్యాస్ కనెక్షన్‌కు నమోదైన మొబైల్ నంబర్, ఆధార్ వివరాలు ఉంటే ప్రక్రియను సులభంగా పూర్తి చేసుకోవచ్చు. ఇండేన్, భారత్ గ్యాస్, హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు తమ సంస్థల అధికారిక యాప్‌ల ద్వారా ఆధార్ ఆధారిత అథెంటికేషన్ చేసుకునే వీలుంది. ఇప్పటికే ఈ–కేవైసీ పూర్తి చేసిన వారు మరోసారి చేయాల్సిన అవసరం లేదని కేంద్రం స్పష్టం చేసింది. గ్యాస్ కనెక్షన్‌కు ఈ–కేవైసీ చేయించుకోవడానికి ఏజెన్సీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే ప్రక్రియ పూర్తి చేసే వెసులుబాటు కల్పించారు. అయితే ప్రారంభించే ముందు గ్యాస్ కనెక్షన్ వివరాలు, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి. కనెక్షన్‌కు ఏ మొబైల్ నంబర్ నమోదై ఉందో కూడా ముందుగా నిర్ధారించుకోవాలి. ఆధార్ అథెంటికేషన్ సమయంలో ఓటీపీ అవసరమైతే రిజిస్టర్డ్ నంబర్‌కే అది వస్తుంది.

## అధికారిక యాప్‌నే ఎంచుకోండి

మీరు వినియోగిస్తున్న గ్యాస్ కంపెనీ అధికారిక యాప్‌ను మాత్రమే ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇండేన్ వినియోగదారులు ఇండియన్‌ఆయిల్ వన్, భారత్ గ్యాస్ వినియోగదారులు హలో బీపీసీఎల్, హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు హెచ్‌పీ పే యాప్‌లను ఉపయోగించవచ్చు. యాప్‌లను ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవడం సురక్షితం. యాప్‌ను తెరిచి గ్యాస్ కనెక్షన్‌కు నమోదైన మొబైల్ నంబర్‌తో లాగిన్ కావాలి. మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసి ధ్రువీకరణ పూర్తి చేయాలి. అనంతరం సంబంధిత గ్యాస్ కనెక్షన్ వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. యాప్‌లోని ప్రొఫైల్ లేదా కస్టమర్ వివరాల విభాగంలో ఈ–కేవైసీ లేదా ఆధార్ అథెంటికేషన్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ సూచించిన విధంగా ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ప్రక్రియను ప్రారంభించాలి. అందుబాటులో ఉన్న విధానాన్ని బట్టి ఓటీపీ, ముఖ గుర్తింపు లేదా బయోమెట్రిక్ ధ్రువీకరణ చేయాల్సి ఉంటుంది.

## స్టేటస్ తప్పక పరిశీలించాలి

అథెంటికేషన్ విజయవంతమైన తర్వాత యాప్‌లో కేవైసీ స్థితిని పరిశీలించాలి. కేవైసీ పూర్తయినట్లు స్టేటస్ కనిపిస్తే ప్రక్రియ ముగిసినట్టే. స్టేటస్ కనిపించకపోతే వెంటనే మళ్లీ ప్రయత్నించకుండా ముందుగా సంబంధిత గ్యాస్ ఏజెన్సీని సంప్రదించడం మంచిది. ఆన్‌లైన్‌లో ఈ–కేవైసీ పూర్తి చేయడం సాధ్యం కాకపోతే సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. సిలిండర్ డెలివరీ చేసే సిబ్బంది వద్ద అందుబాటులో ఉన్న అధికారిక యాప్ ద్వారా కూడా బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయించుకునే అవకాశం ఉంది. ఈ ప్రక్రియకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

## నకిలీ లింక్‌లతో జాగ్రత్త

ఈ–కేవైసీ పేరుతో వచ్చే గుర్తుతెలియని లింక్‌లు, ఏపీకే ఫైళ్లు, అనధికారిక యాప్‌లను ఉపయోగించకూడదు. గ్యాస్ కంపెనీ అధికారిక యాప్ లేదా సంబంధిత ఏజెన్సీ ద్వారానే ప్రక్రియ పూర్తి చేయాలి. ఎవరైనా ఫోన్ చేసి యూపీఐ పిన్, బ్యాంకు పాస్‌వర్డ్ వంటి రహస్య వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. ముఖ్యంగా అందరు వినియోగదారులు మళ్లీ కొత్తగా ఈ–కేవైసీ చేయాల్సిందేనన్న ప్రచారాన్ని నమ్మాల్సిన అవసరం లేదు. కేంద్రం 2026 మార్చిలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులు, ఇంకా బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేయని వారు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ–కేవైసీ పూర్తయిన వారు మరోసారి చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది.

# చదువుకు సైకిల్ ఆసరా

- మానాల విద్యార్థులకు 12 సైకిళ్ల అందజేత
- దూర ప్రాంత విద్యార్థులకు రాకపోకల ఇబ్బందులు లేకుండా
- విద్యాభ్యాసానికి తోడ్పాటుగా సేవా కార్యక్రమం
- విలియన్ భాస్కర్ సౌజన్యం

కాకతీయ, రుద్రంగి : దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు రాకపోకలు సాగించే విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ఆర్మూర్‌కు చెందిన విలియన్ భాస్కర్ 12 సైకిళ్లు అందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విలియన్ భాస్కర్ సౌజన్యంతో సైకిళ్లను అందించారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తగ్గడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువుకు అండగా నిలిచేలా సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన సహాయాన్ని అందించడమే లక్ష్యంగా భవిష్యత్‌లోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు. విద్యాభ్యాసానికి చిన్న సహాయం కూడా పెద్ద ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, యంఈవో రామకృష్ణ, వార్డు సభ్యుడు లక్కాకుల రమేష్, వైస్ ఎంపీపీ పిసరి భూమయ్య, రిటైర్డ్ ఏడీఈ లక్ష్మణ్ నాయక్, రుప్లా తండా సర్పంచ్ జవహర్‌లాల్ నాయక్, విడీసీ చైర్మన్ మహేష్, మదన్, తుమ్ జలపతి, లక్కాకుల శ్రీనివాస్,పిసరి రవీందర్, నాంచారి రాకేష్, కోక్కుల వంశీ, కోల నరేందర్, చెదలు నవీన్, పాల గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**పరకాల సభను విజయవంతం చేయాలి**

**సభా స్థలాన్ని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు ఇనగాల**

**అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న సీఎం**



కాకతీయ, పరకాల : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం పరకాల నియోజకవర్గ కేంద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నందున సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పరకాలలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభా స్థలి, సభా వేదికతో పాటు ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాల ప్రదేశాలను హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయ్యూబ్ అలీ శనివారం పరిశీలించారు. వేదిక నిర్మాణం, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై నాయకులు, అధికారులతో చర్చించారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు, పార్టీ నాయకులకు సూచించారు. భారీ సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉన్నందున సభా ప్రాంగణంలో తగిన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం పర్యటనతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

**రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి.. ప్రజాసేవకు పునరంకితం కావాలి**

**హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి**

**డీసీసీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు**

**మువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన ఇనగాల**



కాకతీయ, హనుమకొండ : స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. శనివారం హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడమే అమరవీరులకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీతో పాటు ఎందరో మహానుభావులు చేసిన పోరాటాలను స్మరించుకోవాలని అన్నారు. తెలంగాణలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల విజయానికి కాంగ్రెస్ శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, ఎం.డి. అజీజ్‌ఖాన్, టీపీసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూచన రవలి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, వివిధ డివిజన్ల, మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నల్లబెల్లిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కాకతీయ, నల్లబెల్లి: మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంఘాలు, విద్యాసంస్థల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, దేశ సమగ్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయి ప్రసన్నకుమార్ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. పీఏసీఎస్‌లో ఎర్రబెల్లి రఘుపతిరావు, మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు జంగిలి మమత జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఏపీఎం సుధాకర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, మహిళా సమాఖ్య ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



# విజయ్–త్రిష.. మళ్లీ హాట్‌టాపిక్!

కాకతీయ
సినిమా
ఆదివారం
16 ఆగస్టు 2026

**కాకతీయ, సినిమా :** తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనకు సంబంధించిన ప్రతి అంశం ఇప్పుడు మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా హీరోయిన్ త్రిషతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యంపై ఎప్పటి నుంచో సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. తాజాగా చెన్నైలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో త్రిష.. విజయ్ తల్లిదండ్రుల పక్కనే ముందు వరుసలో కూర్చోవడం, అనంతరం విజయ్ ఓపెన్ వెహికల్‌లో వెళ్తున్న సమయంలో ఆమె సెల్యూట్ చేయడం, విజయ్ కూడా స్పందించడం వంటి దృశ్యాలు వైరల్‌గా మారాయి. దీంతో మరోసారి విజయ్-త్రిష స్నేహంపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. చెన్నైలోని ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి త్రిష తన తల్లి ఉమా కృష్ణన్‌తో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో విజయ్ తల్లిదండ్రుల పక్కనే ఆమె ముందు వరుసలో కూర్చున్నారు. అనంతరం విజయ్ ఓపెన్ వెహికల్‌లో వెళ్తున్న సమయంలో త్రిష సెల్యూట్ చేయడం.. దానికి విజయ్ స్పందించడం కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో 'విజయ్ కుటుంబంతో త్రిషకు ఇంత సాన్నిహిత్యం ఎలా?' అన్న చర్చ మొదలైంది.

**సినిమాల నుంచే స్నేహం..**

విజయ్, త్రిష కలిసి గతంలో 'గిల్లి', 'తిరుపాచి', 'ఆది', 'కురువి' వంటి చిత్రాల్లో నటించారు. చాలా ఏళ్ల తర్వాత 'లియో'లో మరోసారి జంటగా కనిపించారు. వీరిద్దరి కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉండటంతో పాటు.. వ్యక్తిగతంగానూ ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉందన్న ప్రచారం చాలాకాలంగా సోషల్ మీడియాలో కనిపిస్తోంది. ఈ ఏడాది మేలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమంలోనూ త్రిష ప్రత్యేకంగా కనిపించారు. విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్‌ను త్రిష ఆప్యాయంగా పలకరించి ఆలింగనం చేసుకున్న దృశ్యాలు అప్పట్లోనూ వైరల్ అయ్యాయి. ఇప్పుడు మరోసారి విజయ్ తల్లిదండ్రుల పక్కన ఆమె కనిపించడంతో పాత చర్చలకు కొత్త ఊపొచ్చింది.

**అసలు బంధం ఏమిటి?**

అయితే తెరపై కనిపించిన ఈ సాన్నిహిత్యాన్ని ఆధారంగా చేసుకుని విజయ్, త్రిష మధ్య వ్యక్తిగత బంధం ఉందని నిర్ధారించడం మాత్రం సాధ్యం కాదు. ఇద్దరూ తమ వ్యక్తిగత సంబంధంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సినిమాల ద్వారా ఏర్పడిన స్నేహం, కుటుంబంతో ఉన్న పరిచయం కారణంగానే త్రిషకు విజయ్ కుటుంబంలో ప్రత్యేక గౌరవం ఉండవచ్చన్న అభిప్రాయాలూ ఉన్నాయి. విజయ్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఆయన వ్యక్తిగత, రాజకీయ జీవితానికి సంబంధించిన ప్రతి కదలికపైనా అభిమానులు, నెటిజన్ల దృష్టి పెరిగింది. అలాంటిది త్రిష వంటి స్టార్ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కనిపిస్తే సహజంగానే ఆ దృశ్యాలు వైరల్‌గా మారుతున్నాయి. మొత్తానికి.. విజయ్-త్రిషల మధ్య అసలు అనుబంధం ఏమిటన్నదానిపై ఊహాగానాలు కొనసాగుతున్నా.. ప్రస్తుతం బయటకు కనిపిస్తున్నది మాత్రం వారి మధ్య ఉన్న సాన్నిహిత్యం మాత్రమే.

# వెంకీ.. యూనిఫామ్‌లో వస్తున్నాడు!

- ఈసారి ఇండస్ట్రీ షేక్ అవ్వాల్సిందే..!
- అనిల్ రావిపూడి–వెంకటేష్ కాంబినేషన్‌పై ఆసక్తి
- తొలిసారి ఆర్మీ అధికారిగా వెంకీ
- కౌంటర్ టెర్రరిజం.. బందీల చర్చల నేపథ్యంలో పాత్ర
- కల్యాణ్‌రామ్‌తో ఫస్ట్‌టైమ్ మల్టీస్టారర్
- సంక్రాంతి 2027పై ఇండస్ట్రీలో అంచనాలు



**కాకతీయ, సినిమా :** విక్టరీ వెంకటేష్.. యూనిఫామ్‌లో కనిపించనున్నారు. ఇంతవరకు కుటుంబ కథలు, వినోదాత్మక పాత్రలతో ప్రేక్షకులను అలరించిన వెంకీ.. ఇప్పుడు పూర్తిగా భిన్నమైన మిలటరీ ఆఫీసర్ పాత్రలో తెరపైకి రాబోతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో నందమూరి కల్యాణ్‌రామ్‌తో కలిసి నటిస్తున్న చిత్రంలో లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డిగా ఆయన కనిపించనున్నారు. వెంకటేష్ సినీ ప్రయాణం 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ ఇప్పటికే ఆసక్తిని పెంచింది. యూనిఫామ్‌లో వెంకీ లుక్ బయటకు రావడంతో అభిమానుల్లోనే కాదు.. ఇండస్ట్రీలోనూ ఈ సినిమాపై చర్చ మొదలైంది. క్యామోఫ్లేజ్ యూనిఫామ్, సన్‌గ్లాసెస్, స్కార్ఫ్‌తో వెంకటేష్ కనిపిస్తున్న తీరు ఆయన ఇమేజ్‌కు పూర్తి భిన్నంగా ఉంది. ముఖ్యంగా ఆయన పోషిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్‌రెడ్డి పాత్రకు కౌంటర్ టెర్రరిజం, బందీల చర్చలతో సంబంధం ఉండటంతో సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్‌కు ప్రాధాన్యం ఉంటుందన్న అంచనాలు పెరిగాయి. ఇంతకుముందు వెంకటేష్‌ను ఇలాంటి సీరియస్ మిలటరీ బ్యాక్‌డ్రాప్‌లో ప్రేక్షకులు చూడలేదు. అందుకే ఫస్ట్‌లుక్ నుంచే పాత్రపై ఆసక్తి నెలకొంది.

**రావిపూడి–వెంకీ.. మరోసారి**

వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌కు ఇప్పటికే ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన సినిమాలు వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు అదే కాంబినేషన్‌లో సైనిక నేపథ్యాన్ని తీసుకోవడం ఆసక్తిని మరింత పెంచుతోంది. సాధారణంగా తన సినిమాల్లో కామెడీ, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్‌ను మేళవించే అనిల్ రావిపూడి.. ఈసారి మిలటరీ కథను తన మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఎలా తెరకెక్కిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వెంకటేష్ పాత్రలో సీరియస్ యాక్షన్ కోణం ఉంటూనే.. దర్శకుడి శైలికి తగ్గ వినోదం కూడా ఉంటుందా? లేక పూర్తిగా కొత్త టోన్‌లో సినిమా సాగుతుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అందుకే ఈ కాంబినేషన్‌పై ఇండస్ట్రీ వర్గాల్లోనూ అంచనాలు పెరుగుతున్నాయి.

**కల్యాణ్‌రామ్‌తో ఫస్ట్‌టైమ్**

ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ వెంకటేష్, నందమూరి కల్యాణ్‌రామ్ తొలిసారి కలిసి నటిస్తుండటం. ఇద్దరు భిన్నమైన ఇమేజ్ ఉన్న హీరోలు ఒకే సినిమాలో కనిపించనుండటంతో మల్టీస్టారర్‌పై ఆసక్తి పెరిగింది. వెంకటేష్ ఆర్మీ అధికారి పాత్రలో కనిపించనుండగా.. కల్యాణ్‌రామ్ పాత్ర ఎలా ఉండబోతోంది? కథలో ఇద్దరి పాత్రల మధ్య ఎలాంటి సంబంధం ఉంటుంది? ఇద్దరూ కలిసి కనిపించే సన్నివేశాలు ఏ స్థాయిలో ఉంటాయి? అన్న ప్రశ్నలకు ప్రస్తుతానికి సస్పెన్స్ కొనసాగుతోంది. వెంకటేష్ 40 ఏళ్ల సినీ ప్రయాణం సందర్భంగా వచ్చిన ఫస్ట్‌లుక్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచింది. యూనిఫామ్‌లో ఆయన లుక్, పాత్ర స్వభావంపై చిత్రబృందం ఇచ్చిన సమాచారం.. సినిమాకు సీరియస్ టచ్ ఉండబోతోందన్న సంకేతాలు ఇస్తున్నాయి. దీనికి తోడు అనిల్ రావిపూడి దర్శకత్వం, కల్యాణ్‌రామ్‌తో మల్టీస్టారర్ కావడంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

**సంక్రాంతి బరిలో వెంకీ**

సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం నిర్వహిస్తున్నారు. కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. కుటుంబ వినోదంతో పాటు యాక్షన్, మిలటరీ నేపథ్యాన్ని మేళవిస్తూ సినిమా రూపొందుతోంది. సంక్రాంతి 2027లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. వెంకటేష్ కొత్త అవతారం.. అనిల్ రావిపూడి మార్క్ టేకింగ్.. కల్యాణ్‌రామ్‌తో తొలిసారి కాంబినేషన్.. ఇవన్నీ కలిసొస్తే సంక్రాంతి బరిలో ఈ సినిమా ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశముంది.

# సూర్యకు సాలిడ్ ఓపెనింగ్!

- 'విశ్వనాథ్ అండ్ సన్స్'కు తొలి రోజే రూ.31.51 కోట్ల గ్రాస్
- దేశవ్యాప్తంగా రూ.15.15 కోట్ల నెట్.. తమిళనాడులో రూ.9.15 కోట్లు
- తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి వసూళ్లు
- ఫ్యామిలీ ఎమోషన్స్‌కు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్
- వెంకీ అట్లూరి టేకింగ్, డైలాగ్స్‌కు థియేటర్లలో క్లాప్స్

**కాకతీయ, సినిమా:** సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన తాజా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ *'విశ్వనాథ్ అండ్ సన్స్'*కు బాక్సాఫీస్ వద్ద మంచి ఆరంభం లభించింది. సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తుండటంతో తొలి రోజు వసూళ్లు కూడా ఆశాజనకంగా నమోదయ్యాయి. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు, వినోదాన్ని మేళవించిన కథతో తెరకెక్కిన ఈ చిత్రం సూర్య కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శాక్‌నిల్క్ నివేదికల ప్రకారం.. దేశవ్యాప్తంగా తొలి రోజు రూ.15.15 కోట్ల నెట్, రూ.17.51 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. తమిళనాడులో అత్యధికంగా రూ.9.15 కోట్ల నెట్ రాబట్టగా.. తెలుగు రాష్ట్రాల్లో సుమారు రూ.6 కోట్ల వసూళ్లు సాధించింది.

**ఓవర్సీస్‌లోనూ సూర్య మేనియా**

సూర్యకు ఉన్న మార్కెట్ ప్రభావం ఓవర్సీస్‌లోనూ కనిపించింది. విదేశాల్లో ఈ చిత్రం తొలి రోజే సుమారు రూ.14 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో వరల్డ్‌వైడ్‌గా డే-1లో రూ.31.51 కోట్ల గ్రాస్ వచ్చినట్లు సమాచారం. సినిమాకు వచ్చిన పాజిటివ్ టాక్ నేపథ్యంలో రెండో రోజు అడ్వాన్స్ బుకింగ్స్‌లోనూ జోరు కనిపిస్తోంది. ముఖ్యంగా వీకెండ్ కావడంతో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సూర్య సంజయ్ విశ్వనాథ్ పాత్రలో కనిపించారు. జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్న ఒలింపిక్ షూటర్‌గా ఆయన పాత్ర సాగుతుంది. తన కుమారుడికి పెళ్లి చేసి ఓ ఇంటివాడిని చేయాలని తల్లి పడే తపన.. కుటుంబ బంధాల మధ్య చోటుచేసుకునే భావోద్వేగాలు కథకు ప్రధాన బలంగా నిలిచాయని ప్రేక్షకులు చెబుతున్నారు. సీనియర్ నటి రాధిక తల్లి పాత్రలో ఆకట్టుకోగా.. సూర్య, మమితా బైజు జోడీ కూడా ప్రేక్షకులను మెప్పిస్తోంది. రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. ముఖ్యంగా సూర్య తన పాత్రలో చూపించిన పరిణతి, భావోద్వేగ సన్నివేశాల్లో నటన సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది.

**డైలాగ్స్‌కు థియేటర్లలో క్లాప్స్**

కథతో పాటు సినిమాలోని కొన్ని సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 'మనకి డబ్బులు, స్టేటస్, సౌకర్యం కావాలి కానీ అహంకారం కాకూడదు', 'మనుషులు విడిపోయేది గొడవల వల్ల కాదు.. ఒక గొడవ తర్వాత ఎలా మాట్లాడాలో తెలీక' వంటి డైలాగ్స్‌కు థియేటర్లలో స్పందన వస్తోంది. కుటుంబ సంబంధాలపై దర్శకుడు చెప్పిన మాటలు ప్రేక్షకులకు కనెక్ట్ అవుతున్నాయని తెలుస్తోంది. 'సార్', 'లక్కీ భాస్కర్' తర్వాత వెంకీ అట్లూరి కథా ఎంపిక, స్క్రీన్‌ప్లే విషయంలో మరో మెట్టు ఎక్కినట్లు ఈ సినిమా స్పందన చూస్తే అర్థమవుతోంది. విభిన్న కథాంశాలను ఎంచుకుంటూనే తనదైన భావోద్వేగాన్ని కథలోకి తీసుకురావడం ఆయన ప్రత్యేకతగా మారింది. పాత్రల రూపకల్పన, కథనం, సంభాషణలను సమన్వయం చేసిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే 'లక్కీ భాస్కర్'కు ఉత్తమ డైలాగ్ రైటర్‌గా జాతీయ అవార్డుకు ఎంపికైన వెంకీ అట్లూరి, 'విశ్వనాథ్ అండ్ సన్స్'తోనూ రచయితగా తన స్థాయిని కొనసాగిస్తున్నారన్న ప్రశంసలు వస్తున్నాయి. సూర్యకు వచ్చిన ఓపెనింగ్స్‌కు పాజిటివ్ టాక్ తోడవడంతో రెండో రోజు నుంచి సినిమా మరింత పుంజుకుంటుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




# పెద్ద కలలు కనండి

(మొదటిపేజీ తరువాయి)

వాటిలో ఉత్పత్తి ప్రారంభమైందని ప్రధానమంత్రి తెలిపారు. దేశీయంగా తయారైన తొలి సెమీకండక్టర్ చిప్ త్వరలోనే అందుబాటులోకి రానుందని వెల్లడించారు. ఆధునిక సాంకేతికతకు అత్యంత అవసరమైన అరుదైన ఖనిజాల కోసం ప్రపంచంలోని అనేక దేశాలు ప్రస్తుతం భారత్‌పై ఆధారపడుతున్నాయని చెప్పారు. ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు జాతీయ కీలక ఖనిజాల మిషన్‌ను ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన భద్రత దేశానికి అత్యంత కీలకమని మోదీ అన్నారు. ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అనేక చారిత్రక చర్యలు చేపట్టిందన్నారు. అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా 200 గిగావాట్ల భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు. ఈ లక్ష్య సాధన కోసం దేశంలో కొత్తగా 5 అణు రియాక్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పర్యావరణహిత ఇంధన వినియోగంలో భాగంగా ఇప్పటికే 50 లక్షలకు పైగా ఇళ్లు సౌర విద్యుత్ పరిధిలోకి వచ్చాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 1.75 కోట్ల ఇళ్లకు పైపుల ద్వారా వంటగ్యాస్ చేరుతోందని వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణ పనులు 1925లోనే ప్రారంభమైనా తర్వాత 90 ఏళ్లలో కేవలం 30 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని మోదీ గుర్తుచేశారు. అయితే గత దశాబ్ద కాలంలో మిగిలిన 70 శాతం పనులను పూర్తి చేసి దేశవ్యాప్తంగా రైల్వే విద్యుదీకరణను పూర్తి చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

**సాంకేతికతతో సరికొత్త ప్రగతి**

గత 12 ఏళ్లలో సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా దేశంలో వివిధ రంగాలు గణనీయంగా అభివృద్ధి చెందాయని మోదీ తెలిపారు. రక్షణ ఉత్పత్తులు 4 రెట్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ 7 రెట్లు, హైటెక్ రైల్వే కోచ్‌ల నిర్మాణం 21 రెట్లు, మొబైల్ ఫోన్ల తయారీ 33 రెట్లు పెరిగిందని వివరించారు. రైల్వే విద్యుదీకరణలో తొలి 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే పూర్తయితే, తమ ప్రభుత్వం 10 ఏళ్లలో మిగిలిన 70 శాతం పనులను పూర్తి చేసిందన్నారు. ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, భారత వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో మంచి అవకాశాలు లభిస్తున్నాయని మోదీ అన్నారు. ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 4 రెట్లు పెరిగిందని, పేటెంట్ల మంజూరులోనూ 4 రెట్ల వృద్ధి నమోదైందని తెలిపారు. డిజిటల్ లావాదేవీలు 100 రెట్లు పెరిగాయని వెల్లడించారు. ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు, గ్యాస్ కనెక్షన్లు, పేదల కోసం మరుగుదొడ్లు, ఇళ్ల నిర్మాణ పనులను గతంతో పోలిస్తే అనేక రెట్లు వేగంగా పూర్తి చేస్తున్నామని వివరించారు.



**యువతే వికసిత్ భారత్‌కు బలం**

అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని మోదీ అన్నారు. దేశ అభివృద్ధి ద్వారా అత్యధిక ప్రయోజనం పొందేది కూడా యువతేనని స్పష్టం చేశారు. గత 10, 12 ఏళ్లలో యువత కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని, అందులో స్టార్టప్ ఇండియా కార్యక్రమం కీలకమైనదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని తెలిపారు. యువత తమకు తాముగా ఉపాధి పొందడంతో పాటు అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. ఆవిష్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల నిధిని ఏర్పాటు చేసిందని మోదీ తెలిపారు. యువత తమ కలలను సాకారం చేసుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అందుకు అవసరమైన వనరుల కొరత రానివ్వబోమని హామీ ఇచ్చారు. మధ్యతరగతి కుటుంబాలకు కోచింగ్ క్లాసుల పోటీ పెద్ద భారంగా మారిందని అన్నారు. పిల్లలను కోచింగ్ క్లాసులకు పంపకపోతే తమ కుటుంబానికి పరువు ఉండదేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా యువతకు ఉచిత కోచింగ్ అందించే పూర్తిస్థాయి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు.

**మావోయిజంతో భవిష్యత్ నాశనం**

నక్సలిజం, మావోయిజం ఎంతోమంది యువత భవిష్యత్తును నాశనం చేశాయని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 4 దశాబ్దాల పాటు భయానక వాతావరణంలో, తుపాకీ నీడలో ఎన్నో ప్రాంతాలు, ప్రజలు మగ్గిపోయారని గుర్తుచేశారు. ప్రజలను రక్షించే క్రమంలో 3,500 మందికి పైగా భద్రతా సిబ్బంది ప్రాణత్యాగం చేశారని విచారం వ్యక్తం చేశారు. హింస, విధ్వంసం వల్ల దేశ యువతకు అవకాశాలు దూరమయ్యాయని అన్నారు. శాంతి, అభివృద్ధి, అవకాశాలతోనే యువత భవిష్యత్తును నిర్మించగలమని స్పష్టం చేశారు. సంక్షోభ సమయాల్లో కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేశారని మోదీ మండిపడ్డారు. కొవిడ్ సమయంలో టీకాలు రావని, పశ్చిమాసియా సంక్షోభం తలెత్తినప్పుడు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందని భయాందోళనలు సృష్టించారని అన్నారు. అయితే కేంద్రం తీసుకున్న ముందస్తు చర్యల కారణంగా దేశంలో ఏ రోజూ ఇంధనం, గ్యాస్, యూరియా కొరత రాలేదని స్పష్టం చేశారు. సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొంటూ దేశ ప్రయోజనాలను కాపాడుతున్నామని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం కోసం ప్రతి భారతీయుడు పెద్ద కలలు కని, ఆ కలల సాకారానికి తన వంతు పాత్ర పోషించాలని మోదీ పిలుపునిచ్చారు.

# రూ.100కే జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ!

- టాటా స్టీల్ కీలక నిర్ణయం..
- చర్చిల్ బ్రదర్స్‌కు పూర్తి వాటా బదలాయింపు
- 4.08 కోట్ల షేర్లు.. మొత్తం 100 శాతం వాటా విక్రయం
- ఏఐఎఫ్ఎఫ్ అనుమతితోనే తుది బదలాయింపు
- ఆటగాళ్లు, కోచ్‌లకు కొనసాగనున్న క్లబ్ ఫుట్‌బాల్ ప్రయాణం
- టాటా ఫుట్‌బాల్ అకాడమీ, యువ ప్రతిభపై ఇక పూర్తి దృష్టి

**కాకతీయ, స్పోర్ట్స్ :** భారత ఫుట్‌బాల్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జంషెడ్‌పూర్ ఎఫ్‌సీని టాటా స్టీల్ రూ.100 నామమాత్రపు మొత్తానికి చర్చిల్ బ్రదర్స్ స్పోర్ట్స్ క్లబ్‌కు బదలాయించేందుకు నిర్ణయించింది. టాటా స్టీల్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థ అయిన జంషెడ్‌పూర్ ఫుట్‌బాల్ అండ్ స్పోర్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (జేఎఫ్ఎస్‌పీఎల్)లో తనకున్న మొత్తం 100 శాతం వాటాను చర్చిల్ బ్రదర్స్‌కు విక్రయించేందుకు ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. అయితే ఈ బదలాయింపునకు ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) అనుమతి ఇంకా రావాల్సి ఉంది. టాటా స్టీల్ బోర్డు ఏర్పాటు చేసిన డైరెక్టర్ల కమిటీ ఈ వాటా బదలాయింపునకు ఆమోదం తెలిపింది. జేఎఫ్ఎస్‌పీఎల్‌లో టాటా స్టీల్‌కు ఉన్న 4.08 కోట్ల ఈక్విటీ షేర్లు, ఒక్కో షేరు ముఖ విలువ రూ.10 చొప్పున ఉన్నాయి. ఈ మొత్తం వాటాను చర్చిల్ బ్రదర్స్ స్పోర్ట్స్ క్లబ్‌కు కేవలం రూ.100 నామమాత్రపు మొత్తానికి బదలాయించనున్నారు. ఇందుకు సంబంధించిన షేర్ పర్చేజ్ అగ్రిమెంట్‌పై రెండు సంస్థలు సంతకాలు చేశాయి. జేఎఫ్‌సీ నిర్వహణ బాధ్యతలను కొత్త యాజమాన్యం చేపట్టే దిశగా ఈ ఒప్పందం కీలక అడుగుగా భావిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జేఎఫ్ఎస్‌పీఎల్ టర్నోవర్ రూ.32.23 కోట్లుగా నమోదైంది.

**ఆటగాళ్లు.. కోచ్‌లకు భరోసా**

క్లబ్ యాజమాన్య మార్పుపై టాటా స్టీల్ కార్పొరేట్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ డీబీ సుందర రామమ్ స్పందించారు. భారత ఫుట్‌బాల్‌లో చరిత్ర ఉన్న క్లబ్‌గా చర్చిల్ బ్రదర్స్‌ను పేర్కొంటూ.. ఈ ఒప్పందం ద్వారా జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ ఆటగాళ్లు, కోచ్‌లు క్లబ్ ఫుట్‌బాల్‌లో తమ ప్రయాణాన్ని కొనసాగించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఇటీవల జంషెడ్‌పూర్ ఎఫ్‌సీని స్వాధీనం చేసుకునేందుకు రెండు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపినట్లు రేవ్‌స్పోర్ట్జ్ నివేదించింది. అయితే ఏర్పడిన పరిణామాల నేపథ్యంలో టాటా స్టీల్ క్లబ్‌ను చర్చిల్ బ్రదర్స్‌కు బదలాయించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ నుంచి వైదొలిగినప్పటికీ క్రీడా రంగానికి తమ మద్దతు కొనసాగుతుందని టాటా స్టీల్ స్పష్టం చేసింది. ముఖ్యంగా టాటా ఫుట్‌బాల్ అకాడమీ (టీఎఫ్ఏ), యువ ఫుట్‌బాల్ ప్రతిభ అభివృద్ధిపై పూర్తి దృష్టి పెట్టాలని నిర్ణయించింది. ఇప్పటివరకు టాటా ఫుట్‌బాల్ అకాడమీ నుంచి 150 మందికి పైగా ఆటగాళ్లు భారత జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించారు. వివిధ వయసు విభాగాల్లో 26 మంది జాతీయ జట్లకు కెప్టెన్లుగా వ్యవహరించారు. జంషెడ్‌పూర్‌లోని క్రీడా మౌలిక వసతుల నిర్వహణ, అభివృద్ధిలో పెట్టుబడులు కొనసాగించడంతో పాటు.. ఏఐఎఫ్ఎఫ్‌తో కలిసి యువ ఫుట్‌బాల్ వ్యవస్థ ఆధునికీకరణకు టాటా స్టీల్ పనిచేయనుంది. దీంతో ఒకవైపు జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ కొత్త యాజమాన్యం చేతుల్లోకి వెళ్లనుండగా.. మరోవైపు దేశంలో యువ ఫుట్‌బాల్ ప్రతిభను తీర్చిదిద్దే కార్యక్రమాలపై టాటా స్టీల్ మరింత దృష్టి సారించనుంది.




Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266